



రోగం లేని ఇల్లేది !



ఆ ఇంటిలో తల్లిదండ్రులు తమ ఇద్దరు పిల్లలతో ఉంటారు. కొన్ని రోజులుగా నలుగురూ మందులు మింగుతున్నారు. ఒక్కొక్కరిది ఒక్కో అనారోగ్య సమస్య. నెలకోసారి ఆసుపత్రికి వెళ్లి వైద్యుడిని సంప్రదించి తమ రోగాలకు మందులు తెచ్చుకుంటారు. ఒకరికి కొన్ని రోజులు వాడితే తగ్గే సమస్య అయితే.. మరొకరిది దీర్ఘకాలికంగా మందులు వాడాలి. నలుగురికి కలిపి నెలకు పది వేలకు తక్కువ కాకుండా వైద్యానికే ఖర్చు చేస్తుంటారు. వైద్య పరీక్షలు చేయాల్సి వస్తే ఈ మొత్తం మరింత పెరుగుతుంది.

అసలు మనిషికి ఏమైంది..? రకరకాల రోగాలతో.. గుప్పిళ్ల కొద్దీ ఎందుకు మందులు మింగుతున్నాడు ? ఎప్పుడో కాలం మారిన సందర్భాల్లో కనిపించే రోగాలు.. ఇప్పుడు రోజూ ఎందుకు దాడులు చేస్తున్నాయి ?



- ఆరోగ్య సమస్యలతో అవస్థలు
- నెలకోసారి దవాఖానాకు వెళ్లాలి
- కిటకిటలాడుతున్న ఆసుపత్రులు
- గుప్పిళ్ల కొద్దీ మాత్రలు మింగాలి
- కాలుష్యం.. ఆహార లోపమే కారణం
- ఒత్తిడి.. అవిశ్రాంతి మరో కారణం

'ఒంటి నిండా రోగాలు. బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు, ఆయాసం.. రోజూ గుప్పెడు మందులు మింగాల్సి వస్తోంది. ఆయనకేమో మొన్ననే బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. ఆ మధ్య గుండెకు స్టంట్ వేశారు. రోజూ నాలుగైదు రకాల మందులు మింగాలి. కోడలికేమో నడుం నొప్పి రోజూ టాబ్లెట్ పడాల్సిందే. అబ్బాయికి స్పాండ్‌లైటిస్ మందులు వాడుతున్నాడు. మా ఇల్లే ఓ మెడికల్ షాపు కింద తయారైంది. ఏమిటో ఈ రోగాలు.. మందులు.. బతకాలి కాబట్టి తప్పదు' అంటూ వాపోయింది తణుకుకు చెందిన 60 ఏళ్ల రామలక్ష్మి.

ఆంధ్రజ్యోతి సండే స్పెషల్

7

అమ్మకు ఆవేదన

- 37 వారాలు కూడా నిండకుండానే పుడుతున్న ప్రీమెచ్యూర్ బేబీలు.. కొద్ది రోజులకే మృత్యువాత
- గర్భిణి సంరక్షణలో నిర్లక్ష్యం కూడదంటున్న వైద్యులు

6





సహకార బ్యాంకు పతాకావిష్కరణలో పాల్గొన్న జేసీ ధాత్రిరెడ్డి

రైతులకు 'సహకార' సేవలు

జేసీ ధాత్రిరెడ్డి

ఏలూరుసిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సన్న చిన్నకారు రైతులకు అందుబాటులో ఉంటూ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, సహకార సంఘాలు విస్తృత సేవలందిస్తున్నాయని జేసీ పి.ధాత్రిరెడ్డి అన్నారు. అఖిల భారత సహకార వారోత్సవాలు సందర్భంగా శనివారం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆమె సహకార పతాక ఆవిష్కరణ చేశారు. రైతులు, సభ్యులు అవసరాలను గుర్తించి సకాలంలో సేవలు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. జిల్లా సహకార అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు పీఏసీఎస్‌ల ద్వారా బహుళ సేవలు అందించి ఏలూరు జిల్లాను ప్రగతి పథంలోకి తీసుకొస్తామన్నారు. డీసీసీబీ సీఈవో తిలక్, ఫ్యాకల్టీ ఆర్.శ్రీనివాసరావు మాట్లాడారు. బ్యాంకు సిబ్బంది సహకార ప్రతిజ్ఞ చేశారు.

క్లాప్ డ్రైవర్లకు వేతన బకాయిలు చెల్లించాలి

ఏలూరు టూటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థలో క్లాప్ ఆటోడ్రైవర్లకు బకాయి వేతనాలు చెల్లించాలని యూనియన్ నాయకుడు సోమయ్య డిమాండ్ చేశారు. వెహికల్ డిపో వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. సోమయ్య మాట్లాడుతూ సమ్మెకాలపు వేతనాలు చెల్లించాలన్నారు. పాడైన వాహనాలకు మరమ్మతులు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సొమ్ము ఉద్యోగుల ఖాతాలకు జమ చేయాలన్నారు. అనంతరం కమిషనర్ భానుప్రతాప్‌కు వినతి పత్రం అందించారు.



వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో భక్తులు

చినవెంకన్నకు పోటెత్తిన భక్తులు

ద్వారకాతిరుమల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంతో పాటు శనివారం కావడంతో ద్వారకా తిరుమల ఆలయం భక్తులతో పోటెత్తింది. దాదాపు 25 వేల మంది స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఉచిత దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. అనంతరం ఉచిత అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలోని వృక్షాల వద్ద మహిళా భక్తులు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు.

ఉరుకులు..పరుగులు

పోలవరం ప్రాజెక్టు పనులు ఇప్పుడిప్పుడే ఆరంభమై ఊపం దుకుంటున్నాయి. చింతలపూడి ఎత్తిపోతల పథకం మొదటి దశకు నిధులొచ్చాయి. అసంపూర్తి ఇళ్లను పూర్తి చేసేందుకు సన్నాహాలు. గోతుల రోడ్లకు నిధులు ఇచ్చి మోక్షం. ధాన్యం సేకరణలో గత అనుభవాలకు తెరదింపి తక్షణ పరిష్కారానికి మార్గం సుగమం. మూలన పడి సాగు నీటిసంఘాలకు మళ్లీ జీవం. నిరుద్యోగు లకు ధైర్యం నూరిపోసేలా ఎక్కడికక్కడ శిక్షణ. వయో వృద్ధులకు ఆర్టీసీలో 25 శాతం రాయితీ కల్పిస్తూ కీలక ఆదేశాలు.. ఇలా ఒకటే మిటి ఇన్నాళ్లు మూలనపడ్డ వాటన్నింటికి నిర్వీర్యం స్థానంలో ఉత్తేజం నెలకుంటోంది.

- శాఖల్లో నిర్వేదం తొలగి.. ఉత్సాహం.. చేతినిండా పని
- జలవనరుల శాఖలో పనుల జోష్.. ఆపై నిధులు
- ఆర్అండ్‌బీలో గోతులు పూడాయి.. విద్య, వైద్య రంగాల్లో భారీ కదలిక
- కూటమి ప్రభుత్వం రాకతో ఎక్కడికక్కడ సమీక్షలు.. నిర్ణయాలు

(ఏలూరు - ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ప్రభుత్వ శాఖల్లో గడిచిన ఐదేళ్ల నిర్వేదం, చేతినిండా పనిలేనితనం. రాజకీయ ప్రేరేపిత కుట్రలకు మాత్రమే ప్రాధాన్యత ఇచ్చారు. ఒక్కో వ్యవస్థ తెరమరుగవుతూ వచ్చింది. ఉద్యోగులు, అధికారులదే ఇష్టారాజ్యం. సర్పంచి దగ్గర నుంచి ఎమ్మెల్యే వరకూ చేష్టలూడిగి నిర్వేదమైన చేదు అనుభవాలవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలలు గడిచే లోపు మూలనపడ్డ వ్యవస్థలను గాడిన పెడుతున్నారు. మద్యం విక్రయాల్లో నానాయాగీ చేసి పైపైకి నిషేధం అంటూ గడిచి ఐదేళ్ల జగన్ సర్కారు ప్రజలను ఏమార్చింది. ఇప్పుడు వాటి స్థానంలో నూతన మద్యం విధానం అమల్లోకి తేవడమే కాకుండా నాణ్యమైన మద్యం అందు బాటులోకి తెచ్చారు.

చింతలపూడి ఎత్తిపోతలకు కదలిక

లక్షలాది ఎకరాలకు సాగునీరు, 25 గ్రామాలకు తాగునీరు అందించే చింతలపూడి ఎత్తిపోతల తొలి దశను 2026 నాటికే అధిగమించేందుకు వీలుగా కార్యాచరణ రూపొందించారు. దీనికి తగ్గట్టుగానే తాజాగా బడ్జెట్‌లోనూ కేటాయింపులు చేశారు. పెండింగ్ బిల్లులు అన్నింటికి నిధులు సమకూర్చారు. ఈ ఎత్తిపోతల కింద అక్కడక్కడ భూసేకరణ అడ్డంకిగా మారిన పరిస్థితుల్లో దానిని పరిష్కరించేం దుకు జిల్లా అధికారులు రంగంలోకి దిగి రైతులతో సంప్రదింపులు చేస్తున్నారు. ఇంకోవైపు రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఉమ్మడి పశ్చిమ వాసి కావడతో ఈ ప్రాంతంలో జలవనరులకు ఎలాంటి లోటు లేకుండా నిర్దిష్ట ప్రణాళికలను ఆయనే పర్యవేక్షిస్తుండడంతో జలవనరుల విభాగంలో ఇప్పుడు ఫైళ్లు కదులుతున్నాయి. గతంలో నీరు-చెట్టు పథకం కింద చేసిన పనులకు ఈ మధ్యనే రూ.20 కోట్లకు పైగా బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఎప్పుడో నీరస పడిన తాగునీటి సంఘాలకు మళ్లీ ఎన్నికల రూపంలో జీవం పోస్తున్నారు.

ప్రభుత్వ శాఖలకు పని..

ఇప్పుడు ప్రభుత్వ శాఖల్లో వున్న నిశ్శబ్దాన్ని క్రమేపీ తొలగిస్తున్నారు. ఆర్అండ్‌బీ శాఖలో గడచిన ఐదేళ్ల అరకొర పనులు తప్ప నిధులు కేటాయింపులు లేవు. కూటమి ప్రభుత్వం జిల్లాలోని ఆర్అండ్‌బీ రహదారులకు తాత్కాలిక మరమ్మతులకు రూ.70 కోట్లు, శాశ్వత మరమ్మతులకు రూ. 120 కోట్లు కేటాయించడంతో రోడ్ల మరమ్మతు పనులు పుంజుకున్నాయి. సంక్రాంతి పండుగ లక్ష్యంగా పూర్తి చేయాలని అధికారులు కార్యాచరణ చేస్తున్నారు. పంచాయతీరాజ్ విభాగంలో గడిచిన కొన్నేళ్ల క్రితం నిలిచిపోయిన పనులన్నింటిని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ గాడిపెట్టారు. పంచాయతీరాజ్ రోడ్లకు మోక్షం వచ్చింది. పల్లెల్లో ఉపాధి హామీ పనుల కింద రోడ్ల మరమ్మతులకు పని దొరికింది. ఇంటింటికి కుళాయి పథకం వేగవంతం చేశారు. ఈ వేసవి నాటికే ఎట్టి పరిస్థితుల్లో లక్ష్యాలను అధిగమించాలని ప్రయత్నిస్తున్నారు. రెవెన్యూశాఖలో వున్న నిర్వేదాన్ని ఈ ఐదు నెలల వ్యవధిలోనే పారద్రోలారు. రెవెన్యూ పరంగా కీలకంగా వ్యవహరించడానికి వీలుగా ప్రత్యేక శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. రేషన్ సరుకులు పంపిణీలోనూ ఒడిదుడుకులను తొలగించారు. సూపర్ సిక్స్ కింద ఏడాదికి మూడు సిలిండర్ల పథకం దాదాపు సక్సెస్ అయింది. ధాన్యం సేకరణలో 48 గంటల్లోనే ధాన్యం సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మధ్యలో నిలిచిన గృహాలను పూర్తి చేసేలా అడుగులు వేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 53 వేల ఇళ్లను పూర్తి చేసే ఏర్పాట్లలో వున్నారు. విద్య, వైద్య రంగాల్లో ఆయా శాఖాధిపతులు నిత్య సమీక్షలతో ప్రగతిని సాధించే దిశగా పరుగులు పెడుతున్నారు. దీంతో కొత్త ప్రభుత్వం సరికొత్త మార్పు కన్పిస్తోందన్న భావన అన్ని వర్గాల్లో వ్యక్తమవుతోంది.



ఇటీవల మరమ్మతులు చేపట్టిన కొయ్యలగూడెం మండలంలోని ఎర్రంపేట- రాజవరం రోడ్డు

● పోలవరం వద్ద సందడి

ఆంధ్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టుకు జగన్ పాలనలో మహార్దశ నుంచి క్షీణ దశకు చేరింది. కూటమి ప్రభుత్వం అధికారపగ్గాలు చేపట్టిన కొద్దిరోజుల్లోనే ప్రాజెక్టు పూర్తి చేసేందుకు చురుకైన ప్రయత్నాలు చేసింది. అవన్నీ కలిసొచ్చి ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం నిధులు సమకూర్చ డానికి దారి తీసింది. పోలవరం ప్రాజెక్టు వద్ద పనులకు ఒక్కొక్కటిగా అంకురార్పణ జరుగుతోంది. ఎగువ, దిగువ, కాఫర్ డ్యాంల నడుమ డయాఫ్రం వాల్ నిర్మించే దిశగా ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పుడా ప్రాంతమంతా వచ్చి పోయే వాహనాలు కార్మికులు, పదుల సంఖ్యలో ఇంజనీర్లతో కళకళలాడుతోంది.



పోలవరం ప్రాజెక్టు పవర్ హౌస్‌లో ఇటీవల చేపట్టిన స్టేరింగ్‌ల అమరిక పనులు



బహిరంగ సభలో మాట్లాడుతున్న కాకి మధు

ఉద్యోగ నియామక చట్టం చేయాలి

- ఆదివాసీ నాయకుల డిమాండ్

బుట్టాయగూడెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జీవో నెంబరు 3 రద్దుతో పూర్తిగా ఉద్యోగ అవకాశాలను కోల్పోయిన ఆదివాసీలకు షెడ్యూల్ ప్రాంతంలో నూరుశాతం ఉద్యోగా అవకాశాలను కల్పించడం కోసం షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామక చట్టాన్ని ప్రభుత్వం చేసి తీరాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివాసీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ శనివారం మండల కేంద్రంలో మోటారు సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్ స్టేషన్ వద్ద జరిగిన సభలో ఆదివాసీ సంక్షేమ పరిషత్, ఆదివాసీ ఐక్య కార్యచరణ కమిటీ నాయకులు కాకి మధు, మొడియం శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. జీవో నెం.3 రద్దు కావడంతో అధికారంలోకి వస్తే ప్రత్యామ్నాయంగా చట్టాన్ని తీసుకొస్తామని ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. ఉద్యోగ నియామక చట్టం చేయడమే కాకుండా ఏజెన్సీ ప్రాంతానికి ప్రత్యేక డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులన్ని స్థానిక ఆదివాసీలతో భర్తీ చేయాలన్నారు. గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేయాలని, టీఏసీ భవనాన్ని వెంటనే నిర్మించాలని, షెడ్యూల్ ప్రాంతాల్లో గవర్నర్ పర్యటించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెల్లం లక్ష్మణరావు, కుంజా కృష్ణంరాజు, కుంజా శ్రీను, రవ్వా బసవరాజు, సోడెం ముక్కయ్య, తెల్లం శ్రీనివాసరావు, కోటం లక్ష్మణరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధిక సంఖ్యలో ఆదివాసీలు పాల్గొన్నారు.

ఓ మాజీ కార్పొరేటర్ .. బరి తెగింపు

- జడ్పీ ఆవరణలోని రెండు కమర్షియల్ షాపులకు అక్రమంగా విద్యుత్ వాడకం
- పట్టించుకోని విద్యుత్‌శాఖ అధికారులు



అక్రమంగా విద్యుత్ వినియోగంతో ఏర్పాటు చేసిన లైటింగ్

ఏలూరు టూటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సామాన్యులు కరెంటు బిల్లు సమయానికి కట్టకపోతే విద్యుత్ సిబ్బంది ఇంటికి వచ్చి మరీ ఫీజులు లాక్కుపోతారు. రోడ్డుపక్కన గుడిసెలో ఉండే పేదవాడు పక్కన ఉన్న కరెంటు తీసుకుంటే వారిపై కేసులు పెడతారు. కానీ బడాబాబులు కరెంటు ఎక్కడ నుంచైనా లాక్కోవచ్చు. వారి దరిదాపుల్లోకి ఎవరూ రారు. దరఖాస్తు చేసుకోనవసరం లేదు. డిపార్ట్‌మెంట్ అనుమతి అవసరం లేదు. విద్యుత్ చౌర్యం అవుతున్నట్టు తెలిసినా అధికారులు ఏ చర్యలు తీసుకోరు. ఏలూరులోని జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలో కొన్ని కమర్షియల్ షాపులను లీజుకిచ్చారు. వాటిలో రెండు పెద్ద షాపులను ఓ మాజీ కార్పొరేటర్ లీజుకు తీసుకున్నాడు. వాటిలో హోటల్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. వాటికి సరిగ్గా అద్దె కట్టడం లేదన్న విమర్శలున్నాయి. మరోవైపు కస్టమర్లను ఆకర్షించడం కోసం జిగేలుమనే కరెంటు లైట్లతో డెకరేషన్ చేశారు. అక్కడ ఒక పెద్ద మర్రిచెట్టు ఉంది. ఆ మర్రిచెట్టు ఊడలకు ట్యూబ్‌లైట్లు బిగించారు. అయితే దీనికోసం పబ్లిక్ కరెంటు స్తంభం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా కరెంటు వినియోగిస్తున్నారు. ఆ రోడ్డులోనే ప్రతీ రోజు స్కూల్ బస్సులు తిరుగుతుంటాయి. ఆ సమయంలో వాహనాలపై మర్రిచెట్టుపై నుంచి వైరు తెగి పడి కరెంటు సరఫరా అయితే పరిస్థితి ఏంటి..? అంటూ నగరవాసులు పలువురు ప్రశ్నిస్తున్నారు. అటుగా నిత్యం జిల్లా అధికారులు రాకపోకలు సాగిస్తుంటారు. అయినా ఏ ఒక్క అధికారి పట్టించు కోకపోవడం గమనార్హం. ఎలక్ట్రిసిటీ అధికారులు కనీసం అటు వైపు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అక్రమ కనెక్షన్ తొలగించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.



మర్రిచెట్టుకు విద్యుత్ లైట్లు

స్కానింగ్ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు



- డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట



వైద్యాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట

ఏలూరు అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నదీ, లేనిదీ ఎప్పటికప్పుడు నిర్ధారించుకునేందుకు నిశిత పరిశీలనలతో పాటు, స్థానిక ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థల(ఎన్జీవోలు) సహకారాన్ని తీసుకుని ఆకస్మికంగా డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట ఆదేశించారు. పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టం అమలుతీరుపై, స్కానింగ్ కేంద్రాల నిర్వహణపై వైద్యాధికారులు, గైనకాలజిస్టులతో శనివారం సమావేశం నిర్వహించారు. అన్ని స్కానింగ్ కేంద్రాల్లో ఆయా వైద్య పరీక్షలకు వసూలు చేస్తున్న ధరల పట్టికను ప్రద ర్శించేలా చర్యలు తీసు కోవాలన్నారు. గైనకాలజిస్టులు భానుశైలజ, శ్రీనివాసరావు, శివరామకృష్ణ, భార్గవి, రోహిత్, ఇన్‌చార్జి డెమో నాగరత్నం తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన రాష్ట్రీయ బాలస్వస్థ కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే)లో భాగంగా బాలల సంపూర్ణ ఆరోగ్యరక్ష కార్యక్రమాన్ని చాటపర్రు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం డీఎంహెచ్‌వో ప్రారంభించారు. పిల్లలకు ఆరోగ్య పరీక్షలను పరిశీలించారు. ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ నరేంద్రకృష్ణ, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణ, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ బి.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పన్నులు సకాలంలో చెల్లించాలి

- మునిసిపల్ ఆర్డీ నాగనరసింహారావు



అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీ నరసింహారావు

ఏలూరుటూటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : 'పుట్టిన నాటి నుంచి జీవితాంతం సేవలందించే మునిసిపాలిటీలు, కార్పొరేషన్ అభివృద్ధికి ప్రజలు సహకరించాలి.ఆస్తి, కుళాయి పన్నులు ప్రజలు సకాలంలో చెల్లించాలి' అంటూ మునిసిపల్ రీజనల్ డైరెక్టర్ నాగనరసింహారావు కోరారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో ఏలూరు కార్పొరేషన్ నూజివీడు నూజివీడు, జంగారెడ్డి గూడెం, చింతలపూడి మునిసిపాలిటీ సిబ్బందితో శనివారం సమీక్షించారు. ఆస్తి పన్నులు, కుళాయి పన్నులు వసూళ్లు ఆశాజనకంగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు పరిష్కరిస్తున్నా మన్నారు. నగర రోడ్లపై గుంతలు లేకుండా తీర్చిదిద్దుతామన్నారు. నగరాల్లో, పట్టణాల్లో కుక్కలు తిరగకుండా ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లు చేస్తున్నామన్నారు. ఇంటిపన్నులు, కుళాయి పన్నులు వేయని వాటిని గుర్తించా ని వాటికి త్వరలో పనులు వేస్తామన్నారు. నగర కమిషనర్ భానుప్రతాప్, అడిషనల్, డిప్యూటీ కమిషనర్లు చంద్రయ్య, శివారెడ్డి, చింతలపూడి కమిషనర్ పావని, జంగారెడ్డి గూడెం కమిషనర్ వెంకట రమణ, నూజివీడు కమిషనర్ వెంకట రామిరెడ్డి, మునిసిపాలిటీల సెక్షన్ హెడ్‌ల పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి..

- కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల ధర్నా



ఏలూరు రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చుతూ తక్షణమే ఆదేశాలు విడుదల చేయాలని, 42 రోజుల సమ్మె ఒప్పందాన్ని అమలు చేయాలని మినీ వర్కర్లకు, మెయిన్ వర్కర్లతో సమానంగా వేతనాలు, పదోన్నతులు వేసవి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద శనివారం ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ మాట్లాడుతూ 42 రోజుల రాష్ట్ర వ్యాప్త సమ్మె ముగిసి ఎనిమిది నెలలు గడుస్తున్నా ప్రభుత్వం ఇచ్చిన ఒప్పందం మేరకు ఒక్క డిమాండ్ కూడా నెరవేర్చ లేదన్నారు. సుప్రీం కోర్టు తీర్పును సైతం అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షు రాలు కె.విజయలక్ష్మి, టి.మాణిక్యం, జిల్లా నాయకులు సరళ, టి.హైమావతి, విమల, ఇందిర, భూదేవి, మరియమ్మ, కవిత పాల్గొన్నారు.

పవన్, లోకేశ్‌పై ఎందుకు అనుచిత వ్యాఖ్యలు చేశారు
బోరుగడ్డ అనిల్‌ను విచారించిన వేలేరుపాడు పోలీసులు
వైద్య పరీక్షలు.. కోర్టుకు తరలింపు
- మెయిన్‌లో



మావుళ్లమ్మ దీక్ష

భీమవరం టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మావుళ్ళమ్మ ఆలయంలో శనివారం 141 మంది పాద మండల దీక్ష స్వీకరించారు. తెల్లవారుజామున ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లిఖార్జున శర్మ ఆధ్వర్యంలో ఆలయ వద్ద దీక్షా ధారణ చేశారు. మాలధారులతో ముందుగా విఘ్నేశ్వర పూజ, మాలలకు పూజలు చేసిన అనంతరం ప్రధానార్చకుడు మాల ధారణ చేశారు. దీక్ష నియమాలను వివరించారు. దీక్ష స్వీకరించిన తర్వాత వారంతా అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ఈవో నగేష్ పర్యవేక్షించారు.

శోభాయమానం దీపోత్సవం



కాళ్ళ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవం శనివారం కన్నుల పండువగా జరిగింది. ఏటా కార్తీక మాసంలో పౌర్ణమి రోజున నిర్వహించే వేడుకకు దేవస్థానంలో వైభవోపేతంగా ఏర్పాట్లు చేశారు. దీపాల వెలుగులో శ్రీవారి ఆలయం దేదీప్యమానమైంది. శ్రీవారికి సాయంకాల కైంకర్యాలు, నివేదనలు పూర్తి చేసిన అనంతరం దీపోత్సవం నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరై దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈవో మోకా అరుణ్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.





కాళ్లకూరు వెంకన్న ఆలయంలో కార్తీక దీపోత్సవ దృశ్యాలు





క్షీరారామంలో జ్వాలా తోరణం

పాలకల్లు అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా శనివారం పంచా రామ క్షేత్రం శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయం సమీపంలోని రేపాక వారి సత్రంలో దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు 3,000 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కృత్తికా నక్షత్రం పురస్కరించుకుని శనివారం రాత్రి ఆలయ గోపురం ముందు జ్వాల తోరణం వెలిగించారు. పల్లకిపై స్వామివారి, అమ్మవారి ఉత్సవ మూర్తులను ఉంచి మూడు మార్లు జ్వాల తోరణం కింద నుంచి అటూ ఇటూ తిప్పారు. అర్చకులు కృష్ణప్ప, పూర్ణయ్య, అనీల్ కుమార్ శర్మ, ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. .



సీకే నాయుడు కత్తవపాడులో..!

ఈ విగ్రహం క్రికెట్ దిగ్గజం.. భారత తొలిటెస్ట్ క్రికెట్ కెప్టెన్ కొఠారి కనకయ్య నాయుడుది.. (సీకే నాయుడు)... ఇరగవరం మండలం కత్తవపాడు గ్రామంలో 1997లో ఈ విగ్రహం ఏర్పాటు చేశారు.. ఈయనది గానీ, ఈయన పూర్వీకులది గానీ ఈ గ్రామమై ఉంటుందని అందుకే ఇక్కడ విగ్రహం పెట్టారని అనుకోవచ్చు.. కానీ ఈయన పుట్టి పెరిగింది నాగపూర్‌లో.. మరి ఇక్కడ ఎందుకు విగ్రహం పెట్టారనే డౌట్ వచ్చిందా ? అయితే చదవండి..

ఈ విగ్రహం పెట్టడం వెనుక కథేంటంటే కత్తవపాడు గ్రామానికి చెందిన మామిడి రాజా మహవీర్ చిన్నతనం నుంచి క్రికెట్ అంటే ఆసక్తి .. భారత క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్‌తో రాజామహవీర్‌కు స్నేహం ఉంది.. హైదరాబాద్‌లో ఆయనతో క్రికెట్ పోటీల్లో కూడా పాల్గొనేవారు. క్రికెట్‌పై తనకు ఉన్న ఆసక్తితో మహవీర్ గ్రామంలోని యువకులను ప్రోత్సహించేవారు. గ్రామంలోని పెద్దలతో కలిసి ప్రతి ఏటా మెగా బ్రదర్స్ యూత్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున క్రికెట్ టోర్నమెంటులు నిర్వహించి వారికి బహుమతులు ప్రదానం చేసేవారు. చుట్టపక్కల సుమారు 22 గ్రామాల నుంచి జట్లు పాల్గొనేవి. పోటీల సమయంలో గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొనేది. క్రికెట్‌పై అభిమానాన్ని చూపుతూ మహవీర్ ప్రోత్సాహంతో 1997లో సీకే నాయుడు విగ్రహాన్ని ఏర్పాటు చేయగా అప్పటి మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు ఆవిష్కరించారు.

- ఇరగవరం

అమ్మకు వేదన

నెలలు నిండకుండానే ప్రసవం

శిశువుకు అనారోగ్య సమస్యలు

ప్రాణాలకూ ప్రమాదమే..



నేడు ప్రపంచ ప్రిమెచ్యూరిటీ డే

పెదవే పలికిన మాటల్లోన తీయని మాటే అమ్మ...కదిలే దేవత అమ్మ.. కంటికి వెలుగమ్మా...ఇది ఒక సినీ కవి రాసిన పాట.. అమ్మ ఎంత గొప్పదో అమ్మతనం అంత గొప్పదిగా భావిస్తుంది ప్రతిస్త్రీ.. అలాంటి తల్లి తన గర్భంలో పెరుగుతున్న బిడ్డ (ప్రీమెచ్యూర్‌డ్) ముందస్తుగా పుడితే అది కూడా అనారోగ్యంతో పూర్తికాని శరీర నిర్మాణంతో పుడితే ఆ తల్లి పడే మానసిక క్షోభ, వేదన వర్ణనాతీతం. నేడు ప్రపంచ (ప్రీమెచ్యూరిటీ డే) సందర్భంగా ముందస్తు పుట్టుక లేదా నెలలు నిండకుండా పుట్టడం వచ్చే సమస్యలు..నివారణ మార్గాలపై అవగాహనకు ప్రత్యేక కథనం

- పోలవరం

ప్రిమెచ్యూరిటీ అంటే ముందస్తు పుట్టుక .. నెలలు నిండకుండా పుట్టడం.. నవజాత శిశువుల మరణాలకు, అనారోగ్యంతోఆసుపత్రిలో చేరడానికి ప్రబలమైన కారణం ముందస్తు ప్రసవం. వెయ్యి గ్రాములు అంటే కిలో కంటే తక్కువ బరువుతో పుట్టిన శిశువుల మరణాలకు శ్వాసకోశ వైఫల్యం, జన్మతః సంక్రమిత ఇన్ఫెక్షన్లు,



పుట్టుకతో వచ్చే వైకల్యాలు ప్రధాన కారణాలుగా నిలు స్తాయి. గర్భం దాల్చిన 37 వారాలలోపు జన్మించిన శిశువులు ఆ దశలో లోపల అవయవాలు పూర్తిగా అభివృద్ధి చెందవు. ఎదుగుదలలో లోపం, అనారోగ్య సమస్యలు, వైకాల్యాల సమస్యలు తలెత్తుతాయి. ప్రపంచ వ్యాప్తంగా 10 మంది శిశువుల్లో ఒకరు నెలలు నిండకుండా పుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. ఐక్యరాజ్య సమితి ఇతర ఏజన్సీలు ఇచ్చిన నివేదికల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 1.34 కోట్ల మంది నెలలు నిండ కుండానే పుటుతున్నారని వారిలో దాదాపు పదిలక్షల మంది ముందస్తు సమస్యల కారణం గానే చనిపోతున్నారని తేలింది. తల్లిలో అనారోగ్య సమస్యలు ఎక్కువశాతం కారణాలుగా నిలుస్తున్నాయి. మధుమేహం, అధిక రక్తపోటు, లేదా థైరాయిడ్ లాంటి సమస్యలు , గర్భధారణ సమయంలో గర్భాశయం, మూత్రాశయం లేదా మూత్రపిండాలు (కిడ్నీలు)లో ఇన్ఫెక్షన్లు, లేదా గర్భాశయ సమస్యలు, గర్భాశయ నిర్మాణంలో లోపాలు వల్ల కూడా ముందస్తు జననాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కవలలు లేదా ముగ్గురు కంటే ఎక్కువ శిశువులు గర్భంలో ఉండడం వలన గర్భాశయంలో తగినంత స్థలం లేకపోవడం తల్లి శరీరంపై ఒత్తిడి పెరగడం వల్ల కూడా ముందస్తు ప్రసవాలు జరిగే అవకాశాలు న్నాయి. పోషకాహార లోపం లేదా గర్భధారణ సమయంలో తగినంత బరువు పెరగకపోవడం కూడా ముందస్తు ప్రసవానికి కారణమవుతుంది. అధిక మానసిక శారీరక ఒత్తిడులు కూడా ఈ సమస్యలకు కారణంగా నిలుస్తున్నాయి. మూత్ర సంబంధ ఇన్ఫెక్షన్లు లేదా లైంగిక సంక్రమిత వ్యాధులు , అంటు వ్యాధులకు చికిత్స లేకుండా వదలి వేయడం వంటివి కారణాలుగా ఉన్నాయి.



నివారణకు ఏం చెయ్యాలి ?

ముందస్తు జననం నివారణ కోసం తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలి. గైనకాలజిస్టుల సూచనలు పాటించాలి. ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవరుచుకోవడం, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలను అధిగమించడం మానసిక శారీరక వత్తిడిని నివారించడం, గర్భస్థ శిశువు నుంచి వచ్చే హెచ్చరిక సంకేతాలను గ్రహించడం వంటివి ప్రధానంగా పాటించాలి. పుష్కలంగా పండ్లు, తృణ ధాన్యాలు, కూరగాయలు, ఆకు కూరలు పోషక విలువలు కలిగిన సమతుల ఆహారం తీసుకోవాలి. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్య లకు డాక్టర్ల సలహాల మేరకు మందులు క్రమం తప్పకుండా వాడాలి. వ్యక్తిగత శుభ్రత పాటించడం, ధ్యానం, లోతైన శ్వాస వ్యాయా మాలు అవలంభించాలి. బిడ్డకు బిడ్డకు మధ్య దూరం కనీసం 18 నుంచి 24 నెలలు ఉండేలా చూసుకోవాలి. అధిక బరువులు ఎత్తడం ఎక్కువసేపు నిలబడడం , అతిగా శరీరానికి శ్రమ కలిగించడం చేయకుండా విశ్రాంతి తీసుకోవాలి. ముందస్తు ప్రసవాల నివారణకు నియోనాటాల జిస్టుని ముందస్తుగా సంప్రదించాలి. ప్రసవ సమయంలో శిశువుకి శ్వాస సమస్యలు అల్పోష్ణస్థితికి గుర వకుండా ఇంక్యుబేటర్లు, రేడియంట్ వార్మర్‌లు, ఆక్సిజన్ సౌకర్యాలు కలిగిన ఆస్పత్రులను ఎంచుకోవాలి.

పౌష్టికాహారం, మానసిక ప్రశాంతత అవసరం



ముందస్తు ప్రసవాల నివారణకు పౌష్టికా హారం, మానసిక శారీరక ప్రశాంతత, కుటుంబ వాతావరణాలు చాలావరకూ దోహదపడతాయి. గతంలో ఈ సమస్య ఉన్నవారు, బాల్య వివా హాలు చేసుకున్నవారు, అరక్షిత లైంగిక చర్యలలో పాల్గొన్నవారు, వ్యక్తిగత శుభ్రత, పరిసరాల శుభ్రత లోపాలు కలిగిన వారు గైనకాలజిస్టుని సంప్రదించి తగు వైద్య సహాయం తీసుకోవాలి. అంగన్వాడీల ద్వారా అందే పౌష్టికాహారం , ఐరన్ మెగ్నీషియం సప్లిమెంట్లు డాక్టర్ల సలహా మేరకు తప్పకుండా వాడాలి.

-విష్ణు వర్ధిని, గైనకాలజిస్టు పోలవరం సామాజిక ఆరోగ్య కేంద్రం



విద్యార్థులకు ఓడీ పట్టాలను అందజేస్తున్న యూనివర్సిటీ రిజిస్ట్రార్, తదితరులు

జిల్లాకో యూనివర్శిటీ !

సీఆర్‌ఆర్ విద్యాసంస్థలను యూనివర్శిటీగా ప్రకటించే అవకాశం

స్నాతకోత్సవంలో సంకేతాలిచ్చిన నన్నయ వర్శిటీ రిజిస్ట్రార్ సుధాకర్

ఏలూరు అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు విశ్వవిద్యాలయం లేని లోటు రాబోయే కాలంలో సీఆర్‌ఆర్ విద్యాసంస్థలు యూనివర్శిటీగా ఎదగడం ద్వారా తీరనుందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సుదాకర్ వెల్లడించారు. ఈ విష యమై ప్రభుత్వ లేదా యూనివర్శిటీ స్థాయిలో ప్రతిపాదనలు, పరిశీలనలు, అనుమతులు తదితర పరిణామాల గురించి మాత్రం బహిర్గతం చేయలేదు. డిగ్రీ, పీజీ కోర్సులు ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఒరిజినల్ డిగ్రీ (ఓడీ)లను అందజేసేందుకు శనివారం కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన స్నాతకోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఈ విషయాన్ని ప్రకటించారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ వరుసగా నాలుగు దఫాలు 'నాక్ ఏ గ్రేడ్ గుర్తింపు, స్వయం ప్రతిపత్తి, ఐఎస్‌వో 9001 సర్టిఫికేషన్, తదితర అత్యున్నత ప్రమాణాలను అందుకున్నందున ఇక్కడి కళాశాల త్వరలోనే యూనివర్శిటీగా వర్గోన్నతి పొందడానికి అవసరమైన అన్ని అర్హతలను సాధించిందని వివరించారు. యూజీ, పీజీల నుంచి మొత్తం 36 మంది విద్యార్థులు స్వర్ణ, రజిత పతకాలు పొందటం, అలాగే యూజీలో 657 మంది, పీజీలో 230 మంది విద్యార్థులు ఓడీలను పొందటాన్ని పరిశీలిస్తే ఉభయ గోదావరి జిల్లాల్లోని అతిపెద్ద కళాశాలల్లో ప్రముఖంగా సీఆర్‌ఆర్ కళాశాల నిలిచిందన్నారు. సీఆర్‌ఆర్ విద్యాసంస్థల పాలకవర్గ చైర్మన్ డాక్టర్ అల్లూరి ఇంద్రకుమార్ మాట్లాడుతూ క్యారెక్టర్, కమిట్‌మెంట్, కమ్యూ నికేషన్‌లకు తోడు వ్యక్తిగత క్రమశిక్షణ విద్యార్థులకు అవసరమన్నారు. పాలకవర్గ కార్యదర్శి డాక్టర్ మాగంటి ప్రసాద్, ఉపాధ్యక్షులు బాలకృష్ణారావు, ఏ.వి.సుబ్రహ్మణ్యం, కోశాధికారి చిట్టూరి జానకి రామయ్య, జాయింట్ సెక్రటరీలు కొడాలి సుబ్బారావు, వల్లభనేని శ్రీకృష్ణ, కరస్పాండెంట్లు డాక్టర్ విష్ణుమోహన్, కె.శ్రీనివాస రావు, కె.శివరామ కృష్ణప్రసాద్, శ్రీరంగం, వంకినేని రఘు, ప్రిన్సిపాల్ రామరాజు తదితరులు పాల్గొన్నారు.



జ్ఞాపిక అందుకుంటున్న ఏపీ నిట్ ఆచార్యులు డాక్టర్ శంకర్

టెక్నాలజీ అభివృద్ధిపై సదస్సుకు నిట్ బృందం

తాడేపల్లిగూడెం అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) :ఒడిశా రాష్ట్రంలోని భువ నేశ్వర్ సీఎస్‌ఐఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీలో ఈనెల 13, 14వ తేదీల్లో రెండురోజుల పాటు నిర్వహించిన డీఎస్‌ఐఆర్-సీఆర్‌డీహెచ్ కాన్‌క్లేవ్-2024 జాతీయస్థాయి సమావేశానికి ఏపీ నిట్ బృందం హాజరైంది. ఈ బృందానికి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన సహాయ ఆచార్యులు డాక్టర్ పెద్దపాటి శంకర్ సారథ్యం వహించగా పరిశోధనా సహాయకులుగా ప్రశాంత్, నవనీత్‌లు హాజరయ్యారు. సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పరిధిలోని డిపార్ట్మెంట్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (డీఎస్‌ఐఆర్) నిర్వహించిన కార్యక్రమంలో కామన్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ డెవలప్మెంట్ హబ్ (సీఆర్‌డీహెచ్) సాధించిన పురోగతిని నిర్వాహకులు చర్చించి, భవిష్యత్‌లో చేపట్టనున్న ప్రణాళికలను తెలియజేయడంతో పాటూ సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమలను ప్రోత్సహించడమే ముఖ్య ఉద్దేశంగా సమావేశం నిర్వహించారు. భారత ప్రభుత్వం సహకారంతో సుమారు రెండేళ్ళ క్రితం రూ 7.50 కోట్లతో ఏపీ నిట్‌లో ఏర్పాటు చేసిన సీఆర్‌డీహెచ్ ద్వారా ఇప్పటివరకూ సాధించిన పురోగతిని ఆచార్యులు శంకర్ కాన్‌క్లేవ్‌లో ప్రజంటేషన్ చేశారు. రానున్న కాలంలో పలు కంపనీలతో పరిశోధనల గురించి చర్చించారు. డీఎస్‌ఐఆర్ సైంటిస్ట్ శుక్లా చేతుల మీదుగా శంకర్ జ్ఞాపిక అందుకున్నారు. నిట్ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ రమణారావు, రిజిస్ట్రార్ డాక్టర్ పీ.దినేష్ శంకర్‌రెడ్డి అసోసియేట్ డీన్ డాక్టర్ శంకర్‌ను అభినందించారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఆర్డీవో దాసి రాజు

24న రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు


పాలకొల్లు రూరల్ , నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 24వ తేదీన రాష్ట్రస్థాయిలో నిర్వహించే చదరంగ పోటీల బ్రోచర్‌ను యూరో కిడ్స్ స్కూల్లో శనివారం నరసాపురం ఆర్డీవో దాసి రాజు ఆవిష్కరించారు.చద రంగం మేధస్సును పెంచుతుందన్నా. జిల్లా ర్యాపిడ్ చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి సురేష్ తెలిపారు. విజేతలు రాష్ట్ర స్థాయికి ఎంపిక అవుతారని తెలిపారు. స్కూల్ ఇన్‌చార్జి కిషోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

జాతీయస్థాయి పోటీలకు తోలేరు విద్యార్థులు

భీమవరం టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి ఆటల పోటీల్లో సత్తా చాటి జాతీయస్థాయి పోటీలకు తోలేరు విద్యార్థులు ఎంపికయ్యారు. 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ నెట్ బాల్ పోటీల్లో తోలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులు సత్తా చాటారు. అండర్ -14, 17 విభాగాల్లో పశ్చిమ గోదావరి జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించి ద్వితీయస్థానం సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యాం ప్రసాద్ తెలిపారు. .ఈనెల 9 నుంచి 11 వరకు విశాఖపట్నంలో జరిగిన అండర్-14లో బాలికల విభాగంలో ద్వితీయస్థానం నెల్లూరు జిల్లా ఆత్మకూరులో 10 నుంచి 12వ తేదీ వరకు జరిగిన అండర్- 17బాలురు విభాగంలో ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. అండర్ -17 బాలురు విభాగం నుంచి వీర మల్లు మనోజ్, అండర్-14 బాలికల విభాగం నుంచి వేంద్ర రమ్యశ్రీ ఎంపికయ్యారని పీడీ పూడి శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థులను ఎంపీపీ వీరవల్లి దుర్గ భవాని, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పసుపులేటి హరిరామ కృష్ణ, సర్పంచ్ వేంద్ర లీలా వెంకట కృష్ణ అభినందించారు.



ఎవరెస్టు బేస్‌క్యాంప్‌పై తోటకూర శ్రీనివాస వర్మ

సాహసమే..

60 ఏళ్ల వయసులో ఎవరెస్టు బేస్ క్యాంప్‌పైకి

ప్రమాదకరమే అయినా ఎంతో ఆనందం..

మైనస్ 10 డిగ్రీల చలి

సాహసం సేయరా డింభకా...ఎవరైనా ఏదైనా సాహస కార్యం తలపెడితే పాతాళభైరవి సినిమా లోని ఈ డైలాగ్ వాడుతుంటారు.. ఎవరెస్టు శిఖరం ఎక్కడం చాలా పెద్ద సాహసమే.. దానికి ఉత్సాహ.. పట్టుదల ఉంటే సరిపోదు.. ఆరోగ్యం కూడా సహకరించాలి.. పాలకోడేరు మండలం గొల్లల కోడేరుకు చెందిన తోటకూర శ్రీనివాసవర్మకు చిన్నప్పటి నుంచి ట్రెక్కింగ్ అంటే చాలా ఇష్టం.. 60 ఏళ్ల వయసులో ఆయన చిరకాల కోరికను తీర్చుకున్నారు. ఇటీవల ఎవరెస్టు బేస్‌క్యాంప్‌నకు చేరుకుని ఆయనకు ఇష్టమైన టీడీపీ జెండాను అక్కడ ఎగురవేశారు.. కాకినాడలో కోరమండల్ ఫెర్టిలైజర్స్‌లో మెకానికల్ మేనేజర్గా పనిచేసి 2022లో పదవీ విరమణ చేశారు. ట్రెక్కింగ్‌లో ఎదురైన అనుభవాలను ఆయన ఇలా వివరించారు...

కష్టాలకు ఎదురెళ్లి..

ఎవరెస్టు శిఖరం ఎక్కడం అంత ఆషామాషీ కాదు. పదిరోజులు మంచులో కష్టపడి ఎక్కాలి. మైనస్ 10 డిగ్రీల చలి గజగజ వణికిస్తుంది. శిఖరం దిగే వరకు ఎటువంటి స్నానం ఉండదు. తిండి కూడా కొనుగోలు చేసుకోవలసిందే. రెండు బ్రెడ్‌లు రూ.500, రోటీ ఒకటి రూ.1500, న్యూడిల్స్ రూ.800 అమ్ముతారు.అవి కూడా చప్పచప్పగా ఉంటాయి. అవి తింటూ శిఖరం 500 మీటర్లు ఎక్కుతూ, దిగుతూ నడవాల్సిందే. వాటర్ బాటిల్స్‌ను పరుపుల్లో భద్రపరచుకుని తీసుకువెళ్ళాలి. లేకపోతే గడ్డకట్టుకుపోతాయి.



ఖర్చు రూ. లక్షా యాభై వేలు

ఖాట్మాండు నుంచి లూక్లా వరకు చిన్న చిన్న విమానాలు ఉంటాయి. దానిలో 18 మంది మాత్రమే ఎక్కాల్సి ఉంటుంది. కొండ ప్రాంతం వరకు ఈ విమానాల్లో వెళ్ళాల్సిందే. అక్కడ నుంచి కొండ ఎక్కాలంటే ఒక గైడ్, కూలి సహాయంతో ప్రత్యేక షూలు వేసుకుని వెళ్ళాల్సి ఉంటుంది.ఈ సాహస యాత్ర చెయ్యాలంటే లక్షా 50 వేలు ఖర్చు అవుతుంది. నేను ఒంటరిగా వెళ్లాను. అక్కడ మరో 8 మంది సాహస యాత్రికులను కలిపి గ్రూపుగా పంపారు. ఆ ప్రయాణం తెలియని వింత అనుభూతి.. కొత్త వ్యక్తులతో అయినా ఎంతో ఆనందంగా సాగింది.

ఆహార నియమాలు పాటించాలి

సాహస యాత్ర చెయ్యాలంటే తప్పనిసరిగా ఆహార నియమాలు పాటించాలి.లేకపోతే ఇబ్బందులు వస్తాయి. శిఖరం చేరుకోవటానికి తొమ్మిది రోజులు, కిందకు వచ్చేందుకు నాలుగు రోజులు పడుతుంది. మొత్తం 13 రోజులు యాత్ర చెయ్యవలసి ఉంటుంది. ఈ ప్రాంతం తప్పక చూడాల్సిన ప్రాంతం. అమరనాథ్, కేదార్‌నాథ్, ముక్తినాథ్, శ్రీశైలం (అరణ్యయాత్ర)యాత్రలు కూడా చేశాను.

- పాలకోడేరు



విజేతలకు బహుమతులు అందిస్తున్న పోటీల చైర్మన్ గాంధీ భగవాన్‌రాజు

ఫైనల్స్‌కు చేరిన సీనియర్స్ టెన్నిస్ పోటీలు

పాలకొల్లు అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాస్మో కల్చరల్ స్పోర్ట్స్‌క్లబ్‌లో మూడు రోజులుగా జరుగుతున్న జాతీయ స్థాయి సీనియర్స్ టెన్నిస్ పోటీలు శనివారం లీగ్ దశ ముగిసింది. విజేతలకు పోటీల కమిటీ చైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు, డైరెక్టర్ సోమరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజు బహుమతులు అందజేశారు. 45 ఏళ్ళ విభాగంలో సింగిల్స్‌లో రాజు సుబ్రమ్మ ణయ న్‌పై విజయం సాధించగా ఎంఎస్ కిరణ్ సంపత్ కుమార్‌పై విజయం సాధించారు. 55 ఏళ్ళ విభాగంలో సింగిల్స్ రమేష్ 6-0, 6-2తో సుధాకర్ రెడ్డిపై విజయం సాధించారు. 65 ఏళ్ళ విభాగంలో సెమిఫైనల్స్‌లో సింగిల్స్ సుదర్శనన్ 6-3, 6-0గా జీవి సంన్యాసిరాజుపై విజయం సాధించగా, శ్రీనివాసరెడ్డి ఫాలచంద్రపై విజయం సాధిం చారు. 70 ఏళ్ల విభాగం సింగిల్స్ సెమీఫైనల్స్‌లో రాధాకృష్ణమూర్తి 6-1, 6-2తో సాయిరాంబాబుపై విజయం సాధిచారు. మరో మ్యాచ్‌లో సేతు 6-3, 6-4తో రాధా కృష్ణమూర్తిపై విజయం సాధిచారు.

తణుకులో అఘోరీ

ఇరగవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : హిందూ ధర్మం కాపాడటానికి, గోహత్యను ఆప డానికి మహిళలు, చిన్నారులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ తన వంతు ప్రకృతి సేవ చేసుకుంటున్నానని అఘోరీ నాగ సాధువు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్న అఘోరీ శనివారం సాయంత్రం తణుకు పట్టణంలో ప్రత్యక్షమ య్యారు. ఉజ్జయిని నుంచి తమ గురువు రాజయోగి డాక్టర్ రాజేష్‌నాథ్‌జీ అఘోరా వచ్చారని తెలిసి పట్టణంలోని బ్యాంకు కాలనీలో ఆయన నివాసానికి వచ్చినకట్టు అఘోరీ తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో ముత్యాలమ్మ ఆలయంపై దాడిని ఖండిస్తూ ధర్నా చెయ్యనున్నట్టు తెలిపారు. అఘోరీను చూసేందుకు పెద్దఎత్తున జనం వచ్చారు.



పేదలకు ఇళ్లు ఎప్పుడిస్తారు?

అసెంబ్లీలో మంత్రిని ప్రశ్నించిన ఎమ్మెల్యే బడేటి చంటి



ఏలూరు టూటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు ప్రభుత్వం నిర్మించిన ఇళ్లను ఎప్పటిలోగా లబ్ధిదారులకు అప్పగిస్తారని ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి) అసెంబ్లీలో సంబంధిత మంత్రిని ప్రశ్నించారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో శనివారం ఎమ్మెల్యే చంటి మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వం పేదలకు 6480 గృహాలు మంజూరు చేసిందన్నారు. వాటిలో 4272ఇళ్లు వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. రద్దు చేసిన గృహాల నిర్మాణానికి 13శాతం పూర్తయిందన్నారు. వీటి కోసం ప్రభుత్వం దాదాపు రూ.41 కోట్లు ఖర్చు చేసిందన్నారు. రద్దు చేసిన గృహాలకు మిగిలిన 2208 గృహాలకు లబ్ధిదారులవాటాగా డీడీలు చెల్లించారని అన్నారు. రద్దుచేసిన వారికి డబ్బు వెనక్కి ఇస్తారా మళ్లీ వాళ్ళకు ఇళ్ళు నిర్మించి ఇస్తారా అని మంత్రిని ప్రశ్నించారు. దాదాపు పూర్తయిన 2208 ఇళ్ళను లబ్ధిదారులకు ఎప్పుడు అప్పగిస్తారో చెప్పాలని ప్రశ్నించారు. ఇళ్ళ నిర్మాణానికి లీడ్‌బ్యాంక్ ద్వారా తీసుకున్న రుణాలకు ఇప్పటికి రూ.18కోట్లు వడ్డీ అయ్యిందని అన్నారు. లబ్ధిదారులకు గృహాలు అప్పగించిన తరువాత బ్యాంకు అధికారులకు ఈఎంఐలు, వడ్డీలు కట్టడంలేదని, ఇళ్ళకు తాళాలు వేస్తే పరిస్థితి ఏంటి.. దానికి ఏవిధమైన విధానం అవలంభిస్తున్నారో చెప్పాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల మేరకు పేదలందరికి ఇళ్ళు నిర్మిస్తామని చెప్పామని ఎప్పటిలోగా ఇళ్ళు నిర్మాణాలు చేస్తారో ప్రజలకు తెలపాలని ప్రభుత్వాన్ని కోరారు.

రోగం లేని ఇల్లేది!

ఒకప్పుడు ఇంటిల్లిపాదికి నిండైన ఆరోగ్యం.. కడుపునిండా తిండి, కంటి నిండా నిద్ర, ఎలాంటి ఒత్తిడులు లేవు. రోజువారీ పరుగు అంతకంటే లేదు. అంతా కూడబలుక్కుని వ్యవహారం చక్కబెట్టేవారు. ఒకవేళ ఎవరైనా అనారోగ్యం బారినపడితే అమ్మో అనుకునేవారు. అందుబాటులో వున్న ప్రకృతి వైద్యమే అప్పుడు అందరికీ వరం. అతిపెద్ద నలతతో మంచాన పడి రోజుల తరబడి గడిస్తే గాని పెద్దాసుపత్రికి తీసుకెళ్లేవారు కాదు. చిన్నా చితకా రోగాలకు అసలు మందే వేసుకునేవారుకాదు. కషాయం.. కాపడం వంటి పద్ధతులనే ఎంచుకునేవారు. కానీ రోజులు మారుతున్నాయి. రోజువారీ వ్యవహారిక శైలిలో మార్పు కొట్టొచ్చినట్లుగా కన్పిస్తోంది. రోజువారీ పని ఒత్తిడులు, వెంటాడుతున్న అసంతృప్తులు, కుటుంబ బాధ్యతలు, చదువులు, మంచి మార్కుల కోసం చిన్నారులు గంటల తరబడి పుస్తకాల్లో కూరుకుపోవడం ఇలా ఒకటేమిటి.. మారిన జీవనశైలికి తగ్గట్టుగానే ఇప్పుడు ఇంటింటికీ ఓ రోగం. మందులు వేసుకోనివారు ఉంటే నమ్మశక్యమే కాదు. అంతలా విచ్చలవిడిగా రోగాలు చెలరేగుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు నిత్యం కిక్కిరిసి కన్పిస్తున్నాయి.

- గుప్పిళ్ల కొద్దీ మాత్రలు మింగాల్సిందే
- దవాఖానాలకు వెళ్లాల్సిందే
- ఇంతకు ముందున్న ఇంటి వైద్యానికి ముసుగు
- ఎక్కడికక్కడ కిక్కిరిసిన ఆసుపత్రులే
- కాలుష్యం.. ఆహార లోపం
- ఒత్తిడి.. అవిశ్రాంతి మరో కారణం

ఏలూరు (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

రోజువారీ జీవన ప్రమాణాలకు అనుగుణంగానే ఎక్కువమంది అనారోగ్యాల బారినపాలవుతున్నారు. చిన్నపిల్లల దగ్గర నుంచి వయస్సు పైబడిన వారి వరకు ఆసుపత్రిల్లో వాలాల్సిందే. అంతలా అనారోగ్యం దిగజారుతోంది. ఇంతకుముందు నడివయస్కులు ఎవరైనా ఆసుపత్రికి వెళ్తే వింతగా చూసేవారు. చెడు అలవాట్లు అంటూ చీదరించుకునేవారు. చిన్నారులకు జ్వరం, దగ్గు వంటి చిన్న చిన్న వ్యాధులు సంక్రమించినప్పుడు ఇంటి పట్టునే వైద్యం చేసేవారు. ఎట్టిపరిస్థితుల్లోనూ చిన్నారులకు ఇంగ్లీషు మందులు వాడేవారు కాదు. కేవలం దేశీయ వైద్యంతోనే సరిపెట్టేవారు. కాస్తంత నడివయస్కులకు ఏమాత్రం నలత చేసినా దానికి తగ్గట్టుగానే కొన్నాళ్లపాటు పత్యం చేయించేవారు. ఇలాంటి పరిస్థితుల్లో చక్కగా కొంచెం నయమైన తరువాత ఎవరి పని వారు చేసుకునేవారు. ఇప్పుడేమో ఆనాటి పరిస్థితులకు అంతా విరుద్ధమే. సరాసరిన ఒక్క కుటుంబంలోనే ఇద్దరికి మించి మందులు వాడాల్సిన పరిస్థితి తలెత్తిది. రానురానూ మారుతున్న వాతావరణ పరిస్థితులు, రోజువారీ ఒత్తిడులు వీటికి ప్రేరణగా నిలుస్తున్నాయి. వ్యవసాయదారులెవరు ఇంతకు ముందు ఒక్క రోజైనా నోట్లో మాత్ర వేసుకోవడం ఎరుగనే ఎరుగరు. అలాంటింది ఇప్పుడు పరిస్థితి మారింది. పంటపొలాల్లో వేసే పురుగుమందులు, ఎరువులు, ఇతర వాటితో రైతులు కూడా రోగాల బారినపడుతున్నారు. శ్వాసకోశ వ్యాధులు, జీర్ణకోశ వ్యాధు లతో సహా క్యాన్సర్‌లకు గురవుతున్నారు కేవలం వ్యవసాయం చేసే కుటుంబాల్లో అత్యధికులు ఏదో ఒక రోగం బారినపడుతూనే వున్నారు. ప్రత్యేకించి వ్యవసాయ కూలీలది ఇలాంటి పరిస్థితే. పురుగు సంహారిక మందులు వెదజల్లడం, ఆ రేణువులు ఊపిరితతిత్తుల్లో నిక్షిప్తం కావడంతో త్వరత్వరగా మంచమెక్కుతున్నారు. గ్రామాల్లో తెలిసీ తెలియని వైద్యంతో అధిక మందులు వాడటం పెనువిపత్తులకు దారి తీస్తోంది. ఈ తరహా పరిస్థితులన్నింటిని పల్లెల్లో ప్రతి కుటుబంలో ఎవరో ఒకరు రోజూవారీ చవిచూస్తునే వున్నారు. ఇకపోతే పట్టణాలు దీనికి అతీతమేమీ కాదు. రోజువారీ పని ఒత్తిడులు ఒక వైపు, పెరుగుతున్న కాలుష్యం, వెంటాడుతున్న మానసిక ఒత్తిడుల ముందు వీరంతా పరాజితులు.. రోగగ్రస్తులు. ఒక లెక్క ప్రకారం పల్లెల్లో కంటే పట్టణాల్లో నివసిస్తున్న వారిలోనే అత్యధికులు రోగాల బారినపడుతున్నారు. పల్లె, పట్టణం తేడా లేకుండా చిన్నా రులు అక్కడా ఇక్కడా కూడా పదుల సంఖ్యలో ఆసుపత్రుల్లో చేరుతున్నారు. ప్రత్యేకించి చలికాలంలో వీరి సంఖ్య అలవికానంతగా పెరుగుతోంది. జలుబు, వళ్లు నొప్పులు వంటి సీజనల్ వ్యాధులకు సంబం ధించి కూడా తేలికగా తీసు కోవడం లేదు. ఇంతకు ము ందైతే జండుబామ్, అమృ తాంజన్ వాడటం, ఆవిరి పట్టడం ద్వారా సరిపెట్టు కునేవారు. ఇప్పుడు ఆ

సండే స్పెషల్



పాత పద్ధతులకు స్వస్తి పలికారు. మధ్యవయస్కుల్లో తరచూ వచ్చే వ్యాధులకు తోడు ఈ మధ్యకాలంలో న్యూమో నియా, కిడ్నీ, మధు మేహం, గుండె సంబంధిత వ్యాధులెన్నో వస్తున్నా యి. ఇప్పుడు ప్రతి కుటుం బాన్ని పట్టిపీడిస్తున్న వ్యాధుల్లో మధుమేహం ఒకటి. ఈ వ్యాధి బారినపడి వారందరూ జీవితాతం ఇన్సులిన్ మందులు రోజువారీ విధిగా వాడాల్సిందే. వీటి కోసం ఒక్కొక్కరూ రూ.600 నుంచి రూ.1100 నెలవారీ ఖర్చులు తడిసిమోడవుతున్నాయి. ఇలా ప్రతి ఇంటిలోనూ మధుమేహ వ్యాధిగ్రస్తులే. దీనికి తోడు ఈ మధ్యకాలంలో చికెన్‌గున్యా, మలేరియా, టైఫాయిడ్‌తో పాటు అంతుపట్టని వ్యాధులకు గురువున్నారు. ఒక చిన్న పట్టణంలో వైద్యం కోసం వచ్చే రోగుల సంఖ్య 300 నుంచి 650, ఇన్‌పెషెంట్స్ సంఖ్య పెద్ద పట్టణాల్లో అయితే 600 నుంచి 1000 మంది. వీరంతా నిత్యం పెద్దసంఖ్యలో మాత్రలతో పాటు ఇతరత్రా వాడాల్సిందే. అంతలా రోగాలు వెంటా డుతూ వస్తున్నాయి. కేవలం మందుల కోసం సగటు కుటుంబం రూ.1500 నుంచి రూ. 5 వేల వరకు మెడికల్ షాపులకు నెలకు సమర్పించు కోవాల్సిందే. రోజువారీ సగటు కుటుంబాల్లో ఈ బడ్జెట్ శాశ్వతంగా మారబోతోంది.

కాలుష్యం.. చెదిరిన ఆహార నియమాలు

ఇంతకు ముందు ఇంట్లో వంటకం అందరికి అనువుగా వుండేది. ఇప్పుడా పద్ధతి పూర్తిగా మారిపోయింది. అంతకంటే మించి రెస్టారెంట్‌లకు, కర్రీపాయింట్‌లకు కుటుంబాలకు కుటుంబాలే అలవాటు పడ్డాయి. ఇంట్లో వంటడం ఒకప్పుడు అందరికీ ఇష్టం. ఇప్పుడదే అందరికీ కష్టం. ఈ పరిస్థితి నుంచి దాదాపు సామాన్య కుటుంబాల నుంచి ఉన్నతవర్గాల వరకు బయట ఆహారానికే అలవాటు పడటం ఇప్పుడు అందరి ప్రాణాలను తీస్తోంది. రెస్టారెంట్‌లకు వెళ్లి కడుపు నిండా తినడం వీలైతే రోడ్ల పక్క కాలుష్య భరిత వాతావరణంలో వున్న ఆహారపదార్థాలను కూడా ఇట్టే తినేయడం రోగాలకు కారణమవుతోంది. ఈ మధ్యనే హోటళ్లలో నిల్వ ఉంచిన ఆహారపదార్థాలను ఎలా నిల్వ చేస్తున్నారో బహిర్గతమవుతుంది. దీనికి తోడు వీటిలో వాడే వంట నూనెలు, మసాలాలు ప్రజల ఆరోగ్యాలను పూర్తిగా దెబ్బ తీస్తున్నాయి. కాగిన నూనె అనారోగ్యానికి కారణమని, క్యాన్సర్ కారకమని పదేపదే హెచ్చరిస్తున్నా వేడి వేడి పకోడి, మిర్చి బజ్జి, పునుగుల కోసం అందరు పరుగులు తీస్తూనే ఉంటున్నారు. ఇంకోవైపు వెంటాడుతున్న కాలుష్య భూతం. నీరు గాలి, తినే ఆహారం అంతా కలుషితమే. ఒకప్పుడు క్యాన్సర్ బారిన ఒకరో ఇద్దరో ఉండేవారు. ఇప్పుడా సంఖ్య పదులు దాటి వందల్లోకి చేరుతున్నారు.

• ఆరోగ్యం మన చేతుల్లోనే..



ఎవరో వచ్చి ఏదో చేయరు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది. శ్రద్ధ తీసుకోవాల్సింది మనమే. ఆరోగ్య సంరక్షణలో కీలకం మన జీవనశైలే. ప్రస్తుత పరిస్థితుల్లో డబ్బు ఒక్కటే ప్రధానం కాదు. డబ్బు ఉండి అనారోగ్యం పాలైతే ఏమీ చేయలేం. మంచి జీవనశైలితో సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చు.

- శేషగిరిరావు, దుగ్గిరాల.

• ఆహారమే ఆరోగ్యానికి పునాది



ఆరోగ్యానికి ఆహారమే పునాదిగా భావించాలి. అనేక జబ్బులకు గతి తప్పిన ఆహార అలవాట్లే కారణం. ఈ రోజుల్లో ఇతర దేశాల సంస్కృతికి ఎక్కువగా అలవాటు పడ్డాం. సంపాదనలో పడి ఆరోగ్యాన్ని చేజేతులా పాడు చేసుకుంటున్నాం. ఆరోగ్యంగా లేనప్పుడు ఎంత సంపాదించినా ఫలితం లేదు. మనసు ప్రశాంతంగా శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండాలి.

- సరోజని, ఏలూరు



నకిలీ బంగారం ముఠా అరెస్టు

రూ. 16 లక్షల నగదు స్వాధీనం

ఏలూరు క్రైం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఓ చేపల చెరువు రైతు వద్దకు పనిచేయడానికి వచ్చిన వ్యక్తి ఆ రెతు స్థితిగతులను తెలుసుకున్నాడు. ఆ రైతు అమాయకత్వాన్ని ఆసరా చేసుకున్నాడు. అక్కడ పనిమానేసి వెళ్ళిపోయిన తరువాత ఆ రైతును మోసగించాలని పథకం పన్నాడు. తనతోపాటు మరికొందరిని కలుపుకుని ముఠాగా ఏర్పడి తక్కువ ధరకు బంగారం ఇస్తానని ఆశ చూపించి ఆపై అడ్వాన్సుగా సొమ్ములు తీసుకుని మిగిలిన సొమ్ములు తీసుకు వస్తే బంగారం ఇస్తానని చెప్పి మిగిలిన సొమ్ములు తేగానే దాడికి పాల్పడ్డారు. బాధిత రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముదినేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేసి 16 లక్షల రూపాయల నగదును, నకిలీ బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈకేసు వివరాలను జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ శనివారం ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. కృష్ణాజిల్లా పెడన మండలం చిన్నూరు గ్రామానికి చెందిన పంద్రాజు రవీంద్ర కుమార్ నాలుగేళ్ల నుంచి ముదినేపల్లి మండలం శ్రీహరిపురంలో ఉంటూ చేపలు, రొయ్యలు చెరువులు సాగుచేస్తున్నాడు. అతని వద్ద గతంలో చేపల చెరువుపై పనిచేసిన నెల్లూరు జిల్లా వెంకటగిరి మండలం మల్లాలు పేటకు చెందిన డబ్బా ఈశ్వర్ (23) ఈ ఏడాది అక్టోబర్ నెలలో తరచుగా రవీంద్రకుమార్‌కు ఫోన్‌చేసి తమ వద్ద బంగారం ఉందని తక్కువ ధరకు ఇచ్చేస్తామంటూ నమ్మబలికాడు. అక్టోబర్ 23న బంగారం తనిఖీ చేసుకోవడానికి రావాలని చెప్పడంతో రవీంద్రకుమార్ సింగరాయపాలెం సెంటర్‌కు వెళ్ళాడు. అక్కడ ఈశ్వర్‌తోపాటు మరికొందరు ఉన్నారు. వారి నడుముకు బంగారు పూసల గొలుసు ఉంది. ఆ గొలుసులోని చివరి మూడు పూసలు కట్ చేసి వాటిని పరీక్షించుకోవాలని సూచిం చడంతో అవి అసలైన బంగారమే నని తేలడంతో ఐదు లక్షల అడ్వాన్సు ఇచ్చారు. మిగిలిన 15 లక్షలు మరుసటిరోజే విజయవాడ రమ్మని ఆపై గుంటూరు రమ్మని చెప్పి 15 లక్షల రూపాయలు తీసుకువెళ్ళిన రవీంద్రకుమార్‌ను ఈశ్వర్, అతని ముఠా సభ్యులు కలిసి దాడిచేసి చంపివేస్తానని బెదిరించి 15 లక్షలతో పరారీ అయ్యారు. ఈ ఘటనపై బాధితుడు ముదినేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం చిత్తూరు జిల్లాలో నందివాడ మండలం పొలికొండులో దబ్బా ఈశ్వర్, నెల్లూరు జిల్లా వెంకటగిరి మండలం మల్లాలపేటకు చెందిన బాణావతు చిన్నా (25) చిత్తూరు జిల్లా వేంపాడులోని ఈశ్వర్ కాలనీకి చెందిన భూక్యా సాంబ్రా అలియాస్ శ్యామ్‌లను అరెస్టు చేశారు. ఆ కేసులో మరో నలుగురు నిందితులను అరెస్టు చేయాల్సి ఉంది. నకిలీ బంగారం ముఠాలోని నలుగురు సభ్యులను అరెస్టు చేసిన ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, కైకలూరు రూరల్ సీఐ బి.రవికుమార్, ముదినేపల్లి ఎస్ఐ వీఎస్‌వీ భద్రరావు, మండవల్లి ఎస్ఐ సూర్యరామచంద్రరావు, కలిదిండి ఎస్ఐ పి.వెంకటేశ్వరరావు, కానిస్టేబుళ్ళు వి.నాగబాబు, ఎండి షఫీ, పి.పవన్‌కుమార్, కె.నాగార్జున, ఎస్.రాంబాబు, బి.వెంకటేశ్వరరావు, నాగాంజనేయులు, ఐటీ కోర్ విభాగానికి చెందిన సత్యనారాయణలకు ప్రశంసాపత్రాలు, నగదు రివార్డులను జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్, అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు అందించారు.

మద్యానికి డబ్బు ఇవ్వలేదని సుత్తితో దాడి

భీమవరం క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గునుపూడికి చెందిన పుచ్చకాయల ప్రసన్నకుమార్ ఈనెల 14వ తేదీన రాత్రి పెరుగు ప్యాకెట్ కోసం వెళుతుండగా శాంతారావు అనే వ్యక్తి అడ్డగించి నాకు మందు ఎందుకు ఇప్పించలేదు అంటూ సుత్తితో తలపై, కంటిపై కొట్టి గాయపర్చాడు. ప్రసన్నకుమార్ ఆస్పత్రిలో చేరాడు. ఆస్పత్రి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

కుటుంబాల్లో కల్లోలం

క్రైమ్ కార్నర్

అత్తింటి వేధింపులకు మహిళ బలి

కాల్వలో దూకి ఆత్మహత్య



వైష్ణవి (ఫైల్)

తాడేపల్లిగూడెం అర్బన్, నవంబరు 16: వివాహమై 20 నెలలు కూడా కాలేదు. అంతలోనే అదనపు కట్నం కోసం అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత కాలువలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరా లు ఇలా ఉన్నాయి. తాడేపల్లిగూడెంకు చెందిన బొబ్బిలి వైష్ణవి(29) ని చింతల పూడి గ్రామానికి చెందిన పసుపులేటి నరేంద్రకు ఇచ్చి గత సంవత్సరం మార్చిలో వివాహం చేశారు. నరేంద్ర గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్ ఇస్రోలో ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. వివాహ మైన కొన్ని రోజుల తరువాత అత్తింటి వారి నుంచి అదనపు కట్నం కోసం వేధి ంపులు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో గత 8 నెలల నుంచి వైష్ణవి ఇంటి వద్దే ఉంటుంది. ఈమె ఇంటి వద్ద ఉన్నా కూడా తరుచూ భర్త, అత్తవారింటి నుంచి ఫోన్ రావడం కట్నం కోసం వేధించడం జరిగేదని మృతురాలి బంధువులు తెలిపారు. దీంతో విసిగి పోయిన వైష్ణవి శుక్రవారం గుడికి వెళ్ళి వస్తానని ఇంట్లో చెప్పి తిరిగి రాలేదు. అనుమానంతో ఏలూరు కాలువలో గాలింపులు చేపట్టిన పోలీసు లకు ఈమె మృతదేహం లభ్యమైంది. మృతురాలి తల్లి అంజనీదేవి ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ సుబ్రహ్మణం కేసు నమోదు చేయగా డీఎస్పీ విశ్వనాథ్ దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

ఇరగవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన శుక్రవారం తణుకు రైల్వే అవుట్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. తణుకు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన సంగాని సత్యవతి (74)ఇంటింటికి తిరిగి రొయ్యలు విక్రయించుకుంటూ జీవిస్తున్నది. ఈ క్రమంలో శుక్రవారం పైడిపర్రు నుంచి సజ్జాపురం వెళ్లేందుకు గౌతమి సాల్వెంట్స్ వద్ద రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొట్టింది.

తల్లీకూతుళ్ల అదృశ్యంలో కూతురు మృతి

కనిపించని తల్లి జాడ



తల్లి దుర్గా మల్లేశ్వరి, కూతురు ఉమా దుర్గ

పెనుమంట్ర, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): దంత వైద్యశాలకు అని బయలుదేరి అదృశ్యమైన తల్లి కూతురులో కూతురు మృతదేహం శనివారంనాడు జీఅండ్‌వీ కెనాల్‌లో లభ్యమైంది. దీంతో తల్లి మృతదేహం కోసం బంధువులు, పోలీసులు కెనాల్ వెంబడి గాలింపు చర్యలు చేపట్టారు. దీనిపై పెనుమంట్ర ఎస్సై స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. పెనుమంట్ర మండలం, వెలగలవారిపాలెం గ్రామానికి చెందిన సప్ప దుర్గా మల్లేశ్వరి,(32) ఆమె తన కూతురు ఉమా దుర్గా(11) పెనుమంట్ర డెంటల్ హాస్పిటల్‌కి వెళ్తానని బుధవారం దుర్గ మల్లేశ్వరి తండ్రి గోగాడ ముత్యాలకు చెప్పి ఇంటి వద్ద నుంచి తన మోటారు సైకిల్‌పై వెళ్లింది. ఇక ఇంటికి తిరిగి రాలేదు. గురువారం బ్రాహ్మణ చెరువు గ్రామంలో కాలువ పక్కన రోడ్డు దగ్గర దుర్గా మల్లేశ్వరి మోటార్ సైకిల్ చెప్పులు దొరికినట్లు తెలిపారు. భర్త శ్రీకాంత్‌ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉంటున్నారని తెలిపారు. భార్యభర్తల మధ్య మనస్పర్థలు ఉన్నట్టు బావిస్తున్నారు. శనివారం ఉమా దుర్గా మృతదేహం కాల్వలో దొరికింది. దీంతో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. దుర్గా మల్లేశ్వరి ఆచూకీ దొరకలేదు. ఉమా దుర్గ మృదేహాన్ని తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

వివాహితను కాపాడిన రైల్వే ఎస్ఐ

భీమవరం క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకోవడానికి ఇంటి నుంచి రైల్వేస్టేషన్‌కు వచ్చిన ఒక వివాహితను రైల్వే జీఆర్‌పీ (గవర్నమెంట్ రైల్వే పోలీస్‌స్టేషన్) ఎస్ఐ పీటీవీ రమణ కాపాడారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం.. విజయవాడ రామవరప్పాడుకు చెందిన కొడవలూరి లోకేశ్వరికి పాలకొల్లు మండలం దగ్గులూరుకు చెందిన వడ్రంగి మేస్త్రీతో ఏడాది క్రితం వివాహమైంది. కొంత కాలం క్రితం లోకేశ్వరి భర్తకు అనారోగ్యం రావడంతో ఆసుపత్రిలో చేర్పించారు. ఆరోగ్యం సరి అయ్యాక ఇంటి కొచ్చారు. అయితే మళ్ళీ భర్త మద్యం సేవిస్తూ ఉండటంతో లోకేశ్వరి నిలదీసింది. దీంతో ఇద్దరి మధ్య వివాదం రావడంతో పుట్టింటికి వెళ్ళిపొమ్మని భర్త పంపించి వేశాడు. దీంతో లోకేశ్వరి శనివారం ఉదయం జంక్షన్ రైల్వేస్టేషన్‌కు చేరుకుని ప్లాట్ ఫామ్ చివర ఒంటరిగా కూర్చుని విలపిస్తుంది. ఆ సమయంలో గస్తీ తిరుగుతున్న ఎస్ఐ రమణ ఆమెను ప్రశ్నించారు. దీంతో తాను ఆత్మహత్య చేసుకుంటానని చెప్పడంతో ఎస్ఐ వెంటనే ఆమెను స్టేషన్‌కు తీసుకువెళ్ళి కౌన్సెలింగ్ ఇచ్చారు. భర్త, ఆమె తల్లితండ్రుల్ని రప్పించి వారికి కూడా కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

మద్యానికి డబ్బు ఇవ్వలేదని ఆత్మహత్య

ఏలూరు క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తాను మద్యం తాగడానికి భార్య డబ్బులు ఇవ్వడంలేదని తీవ్ర మన స్తాపానికి గురైన ఒక వృద్ధుడు ఇంటి వద్ద ఒక చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూర నాగేంద్ర కాలనీకి చెందిన పంజంగారి మాణిక్యరెడ్డి(60)కు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. అతిగా మద్యం తాగే అలవాటు ఉంది. శనివారం ఉదయం మద్యం తాగి వచ్చిన అతను ఉదయం 11 గంటల సమయంలో తన భార్యతో గొడవపడ్డాడు. తనకు మద్యం చాలలేదని డబ్బులు కావాలని భార్యను కోరాడు. ఆమె నిరాకరించడంతో ఇంటి వద్ద ఉన్న చెట్టు ఎక్కి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు రూరల్ ఎస్ఐ సీహెచ్ దుర్గా ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై కత్తితో దాడి

ఉంగుటూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నారాయణపురానికి చెందిన పాల వలస నూకరాజు మద్యానికి బానిసయ్యా డు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి మద్యం సేవించి భార్యతో గొడవ పడి ఆమెను తాగడానికి డబ్బులు అడిగాడు. భార్య నగదు ఇవ్వక పోవడంతో కత్తిపీటతో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడ్డ భార్య అనూరాధను ఆస్పత్రిలో చేర్పారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

బంగారం వ్యాపారి అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, నవంబరు 16 (ఆంధ్ర జ్యోతి): తన డ్రైవర్ భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్న విషయం డ్రైవర్‌కు తెలియడంతో భయంతో ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మహా రాష్ట్రకు చెందిన సునీల్ ఆత్మారామ్ నల వాడి (30) ఏలూరు వన్‌టౌన్‌లో బంగారం వ్యాపారం చేస్తూ ఉంటాడు. అతని భార్య తో విడిపోయాడు. వంటరిగా ఉంటున్న అతని వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న యువకుని భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం డ్రైవర్‌కు తెలి యడంతో భయంతో శనివారం ఉరి వేసు కుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘ టనపై ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ మదీనా బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏలూరు ఆసుపత్రికి తరలించారు.

సెంట్రల్ జైలులో కలిశారు.. చోరీలు చేస్తున్నారు!

ముగ్గురి అరెస్టు.. 40 కాసులు బంగారం..రూ.2.70 లక్షల నగదు స్వాధీనం

గోపాలపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గోపాలపురం పోలీసులు రెండు వారాల్లోనే చోరీ కేసును ఛేదించి ముగ్గురిని శనివారం అరెస్టు చేసి సొత్తు స్వాధీనం చేసుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం సాగిపాడుకు చెందిన భమిడిపాటి శ్రీనివాస్ ఈ నెల 2వ తేదీన ఊరెళ్లాడు. ఆ సమయంలో అతని భార్య శారద, అత్తగారు గరిమెళ్ళ సూర్యకాంతం ఉన్నారు. ఇద్దరు వ్యక్తులు మాస్కులు ధరించి ఒక్కసారిగా ఇంట్లో ప్రవేశించారు. ఇంట్లో ఉన్న ఇద్దరు మహిళలు అడ్డుకోవడానికి ప్రయత్నించగా దాడి చేశారు. అనంతరం 40 కాసుల బంగారం, రూ.2.70 లక్షలు నగదు పట్టుకుని పరారయ్యారు. గోపాలపురం శివారు దుర్గమ్మ గుడి వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపడుతుండగా అనుమా నాస్పదంగా కనిపించడంతో అదుపులోకి విచారించారు. ఎట్టకేలకు చోరీ కేసులో ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం పాత కొండగూడెం గ్రామానికి చెందిన చీకట్ల సతీష్ (పండు), షేక్ అబ్దుల్ బాదుల్లా షరీఫ్ (జంగారెడ్డి గూడెం), గోపాలపురం మండల తొక్కిరెడ్డి గూడెం గ్రామానికి చెందిన నక్కా కిషోర్ బాబులను శనివారం ఉదయం అరెస్టు చేశారు. ఏలూరు జిల్లాకు చెందిన ఇద్దరు అంతర జిల్లా నేరస్తులని.. గతంలో జైలుకు వెళ్లివచ్చారు. నక్కా సతీష్‌బాబు ఆయిల్ చోరీ కేసులో సెంట్రల్ జైలులో ఉన్నాడు. జైలులో ఏర్పడిన పరిచయంతో ముగ్గురు స్నేహితులుగా మారారు. చోరీలు చేయడం అలవాటుగా చేసుకున్నారు.

మంత్రిని కలిసిన రెడ్డి అప్పలనాయుడు



ఏలూరు రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథిని ఆయన క్యాంప్ కార్యాలయంలో ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి రెడ్డిఅప్పలనాయుడు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇటీవల ఆర్టీసీ రీజన ల్ బోర్డు, విజయవాడ జోన్ చైర్మన్‌గా రెడ్డి అప్పలనాయుడిని నియమించారు. ఈ క్రమంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసినట్లు రెడ్డిఅప్పలనాయుడు తెలిపారు. రెడ్డిగౌరీ శంకర్, వి.పండు, బి.మధు, వై.ధర్మేంద్ర, రవి తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిఅప్పలనాయుడికి అభినందనలు

ఆర్టీసీ విజయవాడ రీజనల్ బోర్డు జోన్ చైర్మన్‌గా నియమితులైన రెడ్డిఅప్పలనాయుడిని పార్టీ కార్యాలయంలో శనివారం ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు సీహెచ్.శ్రీనివాస్, కార్యదర్శి ఎస్.రామారావు, నాయకులు నరేంద్ర, బేగ్ తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

రోడ్డు ఆక్రమణలపై సమీక్ష

ఉంగుటూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : నారాయణపురం-గణపవరం రోడ్డులో ట్రాఫిక్ సమస్యపై తహసీల్దార్ వై.పూర్ణచంద్ర ప్రసాద్, ఎంపీడీవో రాజ్‌మనోజ్ వివిధ శాఖ అధికారులతో శనివారం ఎంపీడీవో కార్యాలయంలో చర్చించారు. రోడ్డుకి ఇరువైపులా ఉన్న ఇళ్ల యజమానులు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించుకోవాలని సూచించారు. ఈ సమీక్షలో చేబ్రోలు ఎస్సై ఎం.సూర్యభగవాన్, పంచాయతీరాజ్ విస్తర ణాధికారి చంద్ర శేఖరన్, విద్యుత్తు శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ ఆర్ అండ్ బీ, మండల సర్వేయర్ విశ్వనాథ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

కొయ్యలగూడెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం నమోదు వేగవంతం చేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు పారేపల్లి నరేష్ కోరారు. ఈ మేరకు శనివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతు మండలంలో 15 వేల సభ్యత్వాలు చేర్పటమే లక్ష్యం కాగా నేటికి 4,500 పూర్తి చేశామన్నారు.

మండల పరిషత్ సమావేశానికి హాజరుకాని అధికారులు

జంగారెడ్డిగూడెం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సమావేశాలకు హాజరుకాని అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని ఎంపీపీ కొదమ జ్యోతి అన్నారు. జంగారెడ్డిగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఎంపిపి అధ్యక్షతన జరిగింది. పలు అభివృద్ధి పనులపై ఎంపీపీ అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశానికి పోలీసు, ఆర్‌అండ్‌బీ, ఎక్సైజ్, ఇరిగేషన్ వంటి పలు శాఖల అధికారులు హాజరు కాకపోవడం, కొన్ని శాఖల అధికారులు హాజరు కాకుండా వారి సిబ్బందిని పంపించడంపై ఎంపీపీ అస హనం వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ పి.బాబ్జీ ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరు



ధర్నా చేస్తున్న నాయకులు

కొయ్యలగూడెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాపోరు నిర్వహిస్తున్నామని మండల సీపీఎం కన్వీనర్ ఎస్.రాంబాబు అన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ప్రజా సమస్యలపై ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలని, నిత్యావసర ధరలు తగ్గించాలని కోరారు. అర్హులైన నిరుపేదలకు 3 సెంట్ల స్థలం ఇవ్వాలని, గృహ నిర్మాణం కోసం రూ.5 లక్షలు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు ఎ.దుర్గారావు, జగన్నాథం దుర్గమ్మ, ముప్పిడి మౌనిక తదితరులు పాల్గొన్నారు.

కార్తీక దీపోత్సవం



కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ద్వారకాతిరుమల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీవారి క్షేత్ర ఉపాలయమైన చెరువువీధిలోని శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద శనివారం స్వామివారికి అభిషేకాలు, అనంతరం లక్షబిల్వార్చన జరిగింది. రాత్రి జరిగిన సహస్ర దీపోత్సవం నేత్రపర్వమైంది. ఆలయం ముందున్న రహదారి పొడవునా అరటిబోదేల్లో మహిళలు దీపాకలు వెలిగించి తమ భక్తిప్రపత్తులను చాటుకున్నారు.

సోషల్ మీడియా పోస్టులపై చర్యలు తీసుకోవాలి

నిడమర్రు, నవంబర్ 16(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో పవన్ కల్యాణ్‌పై అనుచిత వాఖ్యలు, పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని నిడమర్రు మండల జన సైనికులు సీహెచ్ బాసిరాజు డిమాండ్ చేశారు. నిడమర్రు పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ వీరప్రసాద్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. జనసేన నాయకులు సీహెచ్ బాసిరాజు, ఎస్.దొరబాబు, బి.మురళీ, వి.ఇంద్రకుమార్ పాల్గొన్నారు.

కుంగిన కల్వర్టు

కొండరెడ్ల అవస్థలు



భారీ వర్షాలకు కుంగిపోయిన బండిరేవు కొండవాగుపై నిర్మించిన కల్వర్టు

బుట్టాయగూడెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అలివేరు-లంకపాకల గ్రామాల మధ్య బండిరేవు కొండవాగుపై నిర్మించిన కల్వర్టు కుంగిపోవడంతో పలు గ్రామాలకు చెందిన కొండరెడ్లు రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. కొత్త కల్వర్టును నిర్మించి కేఆర్ పురం ఐటీడీఏ అధికారులు పుణ్యం కట్టుకోవాలని వేడుకుంటున్నారు. గత నాలుగైదు నెలలుగా ఆరు గ్రామాలకు చెందిన కొండరెడ్లు అత్యవసర సమయాల్లోను, నిత్యావసర సరుకుల కోసం ఇతరత్రా అవసరాల కోసం నిత్యం నరకం చూస్తున్నారు. పలుమార్లు గ్రీవెన్స్‌లో విన్నవించినా పట్టించుకున్నవారు లేరని వాపోతున్నారు. బయట ప్రాంతాలకు రావడానికి మరోమార్గం లేక ప్రమాదమని తెలిసినా కుంగిన కల్వర్టుపైనే ప్రాణాలను అరచేత పట్టుకుని ప్రయాణాలు చేస్తున్నారు. గతంలో కొండరెడ్డి గ్రామాలకు వెళ్లడానికి కొండవాగులు ప్రమాదకరంగా మారడంతో సుమారు 25 ఏళ్ల క్రితం ఐటీడీఏ అధికారులు అలివేరు-లంకపాకల గ్రామాల మధ్య బండిరేవు కొండవాగుపై లోలెవల్ కల్వర్టు నిర్మించారు. కల్వ ర్టు నిర్మాణంతో రేపల్లె, రేగులపాడు, డోలుగండి, మోదేలు, నిమ్మలపాడు, లంకపాకల గ్రామాలకు కొండవాగు సమస్య తప్పినట్లు అయ్యింది. ఇన్ని సంవత్సరాలుపాటు సేవలు అందించిన కల్వర్టు ఇటీవల ఏజెన్సీలో కురిసిన భారీ వర్షాలకు వాగు లోపలకు కుంగిపోయింది. రాకపోకలకు ప్రమాదకరంగా మారింది. భారీ వర్షాలు కారణంగా కుంగిన కల్వర్టుపై ఇసుక చేరడంతో కొండరెడ్లు రాకపోకలు సాగిస్తున్నారు. వాగు నీటికి ఇసుక కూడా కొట్టుకుపోతే పూర్తిగా ఆరు కొండరెడ్డి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉందని కొండరెడ్లు గగ్గోలు పెడుతున్నారు. అధికారులు స్పందించి కొత్తగా కల్వర్టును నిర్మించాలని కోరుతున్నారు.

రాకపోకలు నిలిచిపోతాయి

కుంగిన కల్వర్టు విషయాన్ని పలుమార్లు ఐటీడీఏఅధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అధికారులు స్పందించి వెంటనే మరో కల్వర్టు నిర్మించకపోతే అటవీ ప్రాంతంలోని ఆరు కొండరెడ్డి గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. గానుగమామిడి ప్రాంతంలో ఐటీడీఏ నిర్మించిన హైలెవల్ కల్వర్టు మాదిరిగా ఇక్కడ కూడా నిర్మిస్తే కొండరెడ్లకు మేలు జరుగుతుంది.

- కారం రాఘువ,
సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు

హక్కులు, చట్టాలపై అవగాహన ఉండాలి



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతూన్న పురుషోత్తంకుమార్

దెందులూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మహిళాలు, బాలికలకు హక్కులు చట్టాలపై అవగాహన ఉండాలని న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ఏలూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్ అన్నారు. ఏలూరు జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో దెందులూరు తహసీల్దార్ కార్యాలయ అవరణలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్, ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్ ఆధ్వర్యంలో జడ్జి పురుషోత్తం కుమార్ అధ్యతన శనివారం న్యాయ విజ్ఞానంపై అవగహన సదస్సు నిర్వహించారు. ఉచిత న్యాయ సహాయం కోసం 15100కి కాల్ చేస్తే తక్షణం సంబంధిత అధికారులు స్పందించి న్యాయ సహాయం అందిస్తారన్నారు. నూజీవీడు డీఎస్పీ కేవీఎస్ ఎల్‌వీ ప్రసాద్, ఐసీడీఎస్ పీడీ పద్మావతి, తహసీల్దార్ బి.సుమతి, అంగన్వాడీ సీడీపీవో విజయలక్ష్మీ, భీమడోలు బార్ అసోసియే షన్ అధ్యక్షడు కె.నాగేశ్వరరావు, న్యాయవాదులు పాల్గొన్నారు

ఆశ్రం ఆస్పత్రిలో
అరుదైన శస్త్రచికిత్స



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణవర్ధన్

ఏలూరు టూ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆశ్రం ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స చేసినట్టు డాక్టర్ కృష్ణవర్ధన్ శనివారం తెలిపారు. కడుపు నొప్పితో ఆస్పత్రికి వచ్చిన 52 ఏళ్ల సత్యవతి మహిళకు పరీక్షల అనంతరం పాంక్రీయస్ గ్రంథిలో కణితి ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆ కణితిని తొలగించడం చాలా ఎంతో రిస్క్. తీసుకుని ఎండోస్కోపిక్ ఆపరేషన్ ద్వారా తొలగించామన్నారు. ఇలాంటి ఆపరేషన్ ప్రధాన నగరాల్లో ఉన్న కార్పొరేట్ ఆస్పత్రుల్లోనే సాధ్యమవుతుందన్నారు. ఏలూరు ఆశ్రంలో కూడా ఇటువంటి కష్టతరమైన ఆపరేషన్లు ఇటీవల ఎన్నో నిర్వహించామన్నారు. రూ.లక్షా 70 వేలు ఖర్చవుతుందని ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా నిర్వహించామన్నారు.

ఉత్సాహంగా జోనల్ ఆటల పోటీలు



భీమడోలులో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారిణులు

జంగారెడ్డిగూడెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విద్యా వికాస్ పాఠశాలలో ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ (అపుస్మా) ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం, పోలవరం జోన్ ఆటల పోటీలు రెండో రోజుకు చేరుకున్నాయి. 25 పాఠశాలల నుండి విద్యార్థులు పాల్గొన్నారు. ఎంఈవోలు డి.రాముడు, టి.రాములు సందర్శించారు. విద్యా వికాస్ పాఠశాల యాజమాన్యం శ్రీనివాస్, సతీష్ చంద్, సూర్య పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ప్రతిభా పాఠశాల కరస్పాండెంట్ సత్యనారాయణ రెడ్డి, జోనల్ గేమ్స్ ఆర్గనైజర్ సింహాద్రి కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

● భీమడోలు : పోలసానపల్లి గురుకుల పాఠశాలలో జరుగుతున్న జోన్ క్రీడా పోటీలు మూడో రోజుకు చేరుకున్నాయి. శనివారం జరిగిన పలు పోటీల్లో విజేతలను కళాశాల సిబ్బంది ప్రకటించారు. అథ్లెటిక్స్ కాలేజీ విభాగంలో 1500 మీటర్ల పరుగు పందెంలో తేజశ్విని, జి.భూమిక, ప్రవల్లిక, వంద మీటర్ల పరుగు పందెంలో కె.మంజున, యు.భవానీ, డి.ప్రియ ప్రథమ, ద్వితీ య తృతీయ స్థానాల్లో గెలుపొందారు. పాఠశాల విభాగంలో వంద మీటర్ల పరుగు పందెంలో విమలశ్రీ, కుంటముక్కల, టి.నీలిమప్రియ, 200 మీటర్లలో సిహెచ్ కుమారి, డి.ప్రీతిక, మనీషా, కాలేజీ విభాగంలో 200 మీటర్లలో కె.కుసుమలత, బి.నిఖిత, కె.మంజున ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాలు సాధించారు. స్కూల్ విభాగంలో డిస్కస్ త్రోలో పి.కృష్ణశ్రీ, కె.శ్రీవల్లి, ఎస్.రాణి, కళాశాల విభాగంలో డిస్కస్ త్రోలో కె.లావణ్య, కె.నిధి, వి.లిఖిత, జావలింగ్ త్రోలో జి.శ్రావణి, ఎస్. దీప్తి, హారిక ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాలు గెలుపొందారు.

వాలీబాల్ పోటీలు

ఏలూరు రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సురేష్‌చంద్ర బహుగుణ పోలీస్ ఉన్నత పాఠశాలలో భారత గ్రామీణ స్ఫూర్తి పెంపొందించేందుకు ఈసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి బి.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈసా ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

'కళ' కలకాలం ఉండాలి

ఏలూరు రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అంతరించిపోతున్న కళలను బ్రతికించుకుందామని మాజీ ఉపసభాపతి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శనివారంఏలూరు వైఎంహెచ్‌ఏ ప్రాంగణంలో కళాపోషకులు ఎస్.కొండలరావు, సహస్ర పూర్ణచంద్ర దర్శన సందర్భంగా హైదరాబాద్ యువ కళావాహిని ఆధ్వర్యంలో హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం, గరికపాటి ఆర్ట్స్ థియేటర్ సౌజన్యంతో కళాకారులకు ఆత్మీయ సత్కారం ఘనంగా నిర్వహించారు. జానపద కళాకారుడు మిర్యాల శేఖర్‌బాబు, రంగస్థల, టీవీ సినీనటులు విజయ్‌కుమార్, హరికథ భాగవతారిణిలను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందచేశారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.దుర్గాప్రసాద్, వీవీవీ హనుమంతురావు, ఎంఏ హమీద్, ఎంబీ ఖాజావలీ, పి.రామకృష్ణ, గరికపాటి ఆర్ట్స్ థియేటర్ డైరెక్టర్ జి.కాళిదాసు పర్యవేక్షించారు.

స్వచ్ఛతా హీ సేవ

ఏలూరు రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా హీ సేవ ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో చేపట్టి పరిశుభ్రత, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టించుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి వి.సర్వేశ్వరరావు అన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో శనివారం అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద కలెక్టరేట్ సిబ్బందితో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు.

ముగిసిన గౌరిదేవి ఉత్సవాలు



గౌరిదేవి గ్రామోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్థులు

దెందులూరు, నవంబరు16 (ఆంధ్రజ్యోతి), : పోతునూరు శివారు పాతూరులోని గ్రామ దేవత గౌరిదేవి ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. గౌరిదేవికి గ్రామోత్సవం నిర్వహించారు. తొలుత 116 మంది మహిళాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గవర సంఘం, గ్రామస్తులు పాల్గొన్నారు,

క్రైమ్ కార్నర్

87 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు

ఏలూరు క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలో వారం రోజులుగా ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్, స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలను నడుపుతున్న 87 మందిపై కేసులు నమోదు చేయగా వారిలో 71 మందిపై ఛార్జిషీటు దాఖలు చేశారు. ఛార్జీషీటును ఫస్ట్ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు హాజరు పర్చగా వారందరికీ కలిపి రూ.లక్షా 48 వేలు జరిమానా విధించారు. నగరంలో 1266 ఇ-చలానాలను విధించి రూ.ఆరు లక్షల 51 వేల 785లు జరిమానా వేశారు. గతంలో పెండింగ్‌లో ఉన్న ఇ-చలానాలను 32 కేసులు ఆన్‌లైన్‌లో రూ.14 వేల 955లను కట్టించారు. హెల్మెట్ లేనివారికి జరిమానా విధించి 9 మంది చేత హెల్మెట్లు కొనిపించారు. ఏలూరు నగరంలో అత్యధిక శబ్దంతో వెళ్తున్న మోటారు సైకిళ్ళ సైలెన్సర్లను తీయించి మొత్తం 15 మోటారు సైకిళ్ళకు వేరే సైలెన్సర్ వేయించేలా చర్యలు తీసుకున్నారు. ఈ స్పెషల్ డ్రైవ్ ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావుబాబు, సిబ్బంది కలిసి నిర్వహించారు.

● దెందులూరు : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ హెల్మాట్, సీటు బెల్టు పెటుకొని రోడ్డు రవాణా శాఖ అధికారులు ఎస్‌బీ శేఖర్, ఎం.నరేంద్ర సూచించారు. జాతీయ రహదారి ఆశ్రం, వంగూరు అడ్డరోడ్డు దెందులూరు, సోమవరప్పాడు ప్రాంతాల్లోని అడ్డరోడ్డు ఫ్లైఒవర్ కింద శనివారం వాహనాలు తనిఖీ చేశారు. పలవురికి జరిమానాలు విధించారు.

కారు నిర్లక్ష్యంగా నడిపి..

జంగారెడ్డిగూడెం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : కారు నిర్లక్ష్యంగా నడిపి ద్విచక్ర వాహనదారుడిని ఢీకొట్టిన ఘటనలో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌కె.జబీర్ తెలిపారు. పట్టణానికి చెందిన తగరం అశోక్ చంద్ర ఈ నెల 16న గజ్జరం నుంచి జంగారెడ్డిగూడెం వస్తుండగా సాయంత్రం స్థానిక బైపాస్ రోడ్డులోని రామా డిస్టిలరీస్ సమీపానికి చేరుకునే సరికి అశ్వారావుపేట నుంచి రాజమండ్రి వైపుగా వెళ్ళే లారీని హ్యుందయ్ ఐ టెన్ కారు ఓవర్‌టేక్ చేసే క్రమంలో అతివేగంగా వస్తూ ఎదురుగా వస్తున్న పల్సర్ ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీ కొట్టాడు. ఈ ఘటనలో ద్విచక్ర వాహనం నడిపే అశోక్ చంద్రకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అతన్ని పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అద్దె కారు తాకట్టు

ఏలూరు క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అద్దెకు తీసుకున్న కారును వేరేచోట తాకట్టుపెట్టి మోసగించాడని పోలీసులకు ఫిర్యాదు అందడంతో ఒక వ్యక్తి పై చీటింగ్ కేసు నమోదు చేశారు. ఏలూరులోని ద్వారకానగర్‌కు చెందిన నెర్సు శివ కృష్ణకు ఎర్టిగా కారు ఉంది. దానిని కిరాయికి తిప్పుతుంటాడు. ఏలూరు రూరల్ మండలం పుష్పలీలా నగర్‌కు చెందిన ముంగర అభిషేక్ అలి యాస్ గణేష్ ఆ కారుకు నెలకు రూ.40 వేలు ఇస్తానని ఈ ఏడాది ఆగస్టు 18న తీసుకున్నాడు. ఇప్పటి వరకూ ఒక్క రూపాయి అద్దె కూడా చెల్లించడంలేదు. కారూ ఇవ్వడం లేదు. ఆ కారు ఎక్కడ ఉందో తెలుసుకోవడానికి శివకృష్ణ ప్రయత్నం చేయగా తాకట్టు పెట్టాడని తెలిసింది. దీంతో శనివారం రాత్రి ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రూరల్ ఎస్‌ఐ సిహెచ్ దుర్గా ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎక్సైజ్ దాడులు

జంగారెడ్డిగూడెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జీలుగుమిల్లి మండల పరిధిలో ఎక్సైజ్ పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ములగలంపల్లిలో 11 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని గుళ్ళా సాయికుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనుబాబు తెలిపారు. పట్టణంలోని డాంగేనగర్‌లో మురాల సీతారామయ్య వద్ద 9 మద్యం సీసాలను, తాడువాయ్‌లోని మరపట్ల రాంబాబు వద్ద 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ ఎస్సైలు వెంకటలక్ష్మి, ఎస్‌ఎంఎస్ సుబ్రహ్మణ్యం, ఏలూరు ఎన్‌ఫోర్స్ మెంట్ ఎస్సై బి.రాజేంద్ర ప్రసాద్, ఆరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

చింతలపూడి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శివపురంలో శనివారం పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేసి 16 మందిని అరెస్టు చేసి, రూ.60 వేలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవీంద్రనాయక్ తెలిపారు.

ఐదు సబ్సిడీ సిలెండర్లు సీజ్

ద్వారకాతిరుమల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పంగిడిగూడెంలోని కుమారి ఫ్యామిలీ డాబాలో డొమస్టిక్ గ్యాస్ వినియోగిస్తున్నారన్న సమాచారంతో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం దాడులు చేశారు. దాబా యజమాని దూదిపాల నాగరాజు గృహావసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నట్లు గుర్తించి ఐదు సిలిండర్లను సీజ్ చేశారు. డాబా యజమానిపై కేసు నమోదు చేసినట్లు, రీజనల్ విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారి రాంబాబు తెలి పారు. దాడుల్లో విజిలెన్స్ ఎస్‌ఐ రంజిత్‌కుమార్, సీఎస్‌డీటీ కామేశ్వరరావు పాల్గొన్నారు.

నగరంలో పోలీసుల గస్తీ



ఏలూరు నగరంలో రాత్రిళ్ల గస్తీ నిర్వహిస్తున్న స్పెషల్ పార్టీ పోలీసులు

ఏలూరు క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాత్రి వేళ స్పెషల్ పార్టీ పోలీసులు నగరంలో గస్తీ నిర్వహిస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఎవరైనా మద్యం తాగితే సహించేదిలేదని హెచ్చరి కలు జారీ చేస్తున్నారు. శుక్రవారం రాత్రి ఏలూరు వన్ టౌన్ ఎస్‌ఐ మదీనాబాషా, వారి సిబ్బంది స్పెషల్ పార్టీ పోలీసులు నగరంలో విస్తృతంగా గస్తీ నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తులను ప్రశ్నించారు. నగరంలో ఎవరైనా రాత్రి వేళ అకార ణంగా రోడ్లపై తిరిగితే కఠిన చర్యలు తీసుకుం టామని పోలీసులు హెచ్చరించారు.

పరివర్తన్‌ను సందర్శించిన రిజిస్ట్రార్

ఏలూరు రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక దొండపాడులోని పరివర్తన్ దివ్యాంగుల పాఠశాలను శనివారం ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ సుధాకర్ శనివారం సందర్శించారు. బదిరులకు విద్యాబోధన, సంస్థ అందచేస్తున్న కృత్రిమ అవయువాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ పిల్లలకు విద్యబోధించటమే కష్టమని, అటువంటిది దివ్యాంగుల పిల్లలకు సహనంతో విద్యాబోధన చేయటం అభినందనీయమన్నారు. 16 ఏళ్ళుగా పరివర్తన్ 10వ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించటం ప్రశంసనీయమన్నారు. దివ్యాంగులమనే భావన వీడి ఉన్నత శిఖరాలు అదిరోహించాలని సంస్థకు తనవంతు సహకారాన్ని అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రణాళిక అవసరం

జీలుగుమిల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక అవసరమని డీఎల్‌డీవో రాజు అన్నారు. జీలుగుమిల్లిలో పంచాయతీల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, స్థానిక వనరుల వినియోగం, పారిశుద్యం, డంపింగ్ యార్డుల నిర్వహణ, వర్మీ కంపోస్టు షేడ్‌ల ద్వారా పంచాయతీలకు సమకూరే ఆదాయ మార్గాలు వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. డీఎల్‌పీవో రజావుల్లా, ఎంపీడీవో కె.వెంకటలక్ష్మీ, ఎంఈవో కె.శ్రీనివాస్, కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్ర స్థాయి పర్యటన

ఉంగుటూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఉప్పాకపాడు పాఠశాల విద్యారులు శనివారం మూడో తరగతిలోని పరిసరాల విజ్ఞానం అంశంలో క్షేత్ర స్థాయిలో పర్యటించారు. వివి ధ రకాల ఇళ్లు వాటి నిర్మాణంపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం ఎస్.సుధాకర్, ఎ.శ్రీను పాల్గొన్నారు.

గ్రంథాలయ పితామహులకు నివాళి



ఏలూరు జిల్లా గ్రంథాలయంలో ప్రముఖులకు నివాళులర్పిస్తున్న సిబ్బంది

ఏలూరు టూ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు జరిగింది. గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్.రం గనాధన్, అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యదర్శి శేఖర్‌బాబు, ఎస్.గణపతిరాజు, నరసింహారావు, ఎన్.సత్యనారాయణ, బీకే అయ్యంగార్, అసిస్టెంట్ లైబ్రేరియన్లు నారాయణరావు, సందీప్‌కుమార్ పాల్గొన్నారు. మహిళా గ్రంథాలయంలో గ్రంథపాలకురాలు వై.శ్రీదేవి ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అభివృద్ధి కమిటీ చైర్మన్ సుశీల, నిర్మల, డ్రాయింగ్ మాస్టర్ జి.మోహన్‌జ్యోతి, పీ.ఈశ్వరి పాల్గొన్నారు.

● లింగపాలెం : ధర్మాజీగూడెం శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు పలు పోటీ పరీక్షలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి సిహెచ్ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ మహనీయుల జీవిత చరిత్ర పుస్తకాలను చదవాలన్నారు.

● టి.నరసాపురం : స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయాల విశిష్టతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో టి.రామ్మూర్తి, గ్రంథాలయ పాలకులు ఆర్.కిషోర్, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు కె.రాజు పాల్గొన్నారు.

● ఉంగుటూరు : గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులను పితామహులను ఆదర్శంగా తీసుకోవాలని ఇన్‌చార్జి తహశీల్దార్ వై.పూర్ణ చంద్ర ప్రసాద్ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమ పితామహులకు నివాళులర్పించారు. గ్రంథ పాలకుడు సీహెచ్ గంగాధరం పాల్గొన్నారు

● పెదవేగి: శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జడ్పీ ఉన్నత పాఠశాల పీడీ పి.ధనలక్ష్మి మాట్లా డుతూ ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకత బయటకు వస్తుందన్నారు. గ్రంథపాలకుడు టి. అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

● చింతలపూడి : స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖనం, దేశ భక్తి పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయు లు ఏసుపాదం గ్రంథాలయ అధికారి ఎస్.వర్మ విద్యార్థులు పాల్గొన్నారు.

● భీమడోలు : భీమడోలు, గుండుగొలను, పూళ్ళ శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భీమడోలులో జరిగిన కార్యక్రమంలో టి.ఉమామహేశ్వరరావు, ఎం.సుధాకర్, గ్రంథపాలకుడు శ్రీనివాస్ పాల్గొన్నారు. గుండుగొలు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావంపై వక్తృత్వ పోటీలు, పద్యాల పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయురాలు పద్మావతి, ఆనంద్‌బాబు, గ్రంథపాలకురాలు నాగమణి పాల్గొన్నారు.

సివిల్స్‌కు ఉచిత శిక్షణ

ఏలూరు రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు యూపీఎస్‌ఈ నిర్వహించే సివిల్ సర్వీసెస్ ప్రాథమిక, తుది పరీక్షల కోసం బీసీ స్టడీ సర్కిల్, గొల్లపూడి, విజయవాడలో ఉచిత శిక్షణ ఇస్తున్నామని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి ఆర్.నాగరాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లాకు చెందిన అర్హత గల బీసీ, ఎస్సీ, ఎస్టీ కులానికి చెందిన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు పద, ఇంటర్, డిగ్రీ మార్కుల లిస్ట్, కుల, ఆదాయ ధ్రువీకరణ, ఆధార్ జిరాక్స్‌లు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఈ నెల 24వ తేదీలోపు కలెక్టరేట్ కాంపౌండ్‌లో ఉన్న బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 27న స్క్రీనింగ్ పరీక్ష ఉంటుందన్నారు. అందులో ఎంపికైన వంద మంది బీసీలకు 66 శాతం, ఎస్సీలకు 20, ఎస్టీలకు 14 శాతం, రిజర్వేషన్ ప్రాతిపదికన ఉచిత శిక్షణ బస, భోజన వసతి, కల్పిస్తున్నట్లు తెలిపారు. మరింత సమాచారానికి 75691 84335 నెంబర్‌లో సంప్రదించవలసిందిగా ఆమె విజ్ఞప్తి చేశారు.

రేపు అంతర్జాతీయ విద్యా ప్రదర్శన

పెదపాడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వట్లూరులోని రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల, లీయో గ్లోబల్ ఓవర్సీస్ ఆధ్వర్యంలో ఈ నెల 18న అంతర్జాతీయ విద్యా ప్రదర్శన ఏర్పాటు చేసినట్లుగా ప్రిన్సిపాల్ డాక్టరు డి.మురళీధరరావు తెలిపారు. విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడుతూ యుఎస్, యుకే, కెనడా, ఆస్ట్రేలియా వంటి 25 ప్రముఖ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు హాజరవుతారన్నారు. వీరంతా భవిష్యతులో డిమాండ్ ఉన్న కోర్సులు, వాటి అర్హతలు, స్కాలర్‌షిప్‌లు వంటి అంశాలను విద్యార్థులకు వివరిస్తారన్నారు. అంతర్జాతీయ విద్యా ప్రదర్శనలో పాల్గొనడం ద్వారా విద్యార్థులు వారి కెరీర్‌కు దోహదపడే అంశాలను తెలుసుకోవడం ద్వారా ఉన్నత స్థానాలకు చేరుకోవడం సులభమవుతుందన్నారు. కళాశాల డీన్ ఎస్ఎస్ శర్మ, లీయో కన్సల్టెన్సీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రసన్నలక్ష్మిపాల్గొన్నారు.

ట్యాంకర్‌తో తాగునీటి సరఫరా

ఉంగుటూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గోపీనాథపట్నంలో తాగునీటి సమస్య రావడంతో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు నేతృత్వంలోని లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాటర్ ట్యాంకర్‌ను పంపించి స్థానికులు దాహార్తిని తీర్చారు.

ప్రజా సమస్యలపై పోరాటం చేస్తాం



ఎం.సుధారాణి

టి.నరసాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై పోరాటాలు ఉధృతం చేస్తామని సీపీఎం మండల కార్యదర్శి మడకం సుధారాణి అన్నారు. సీపీఎం నూతన మండల కార్యదర్శిగా సుధారాణిని ఆ పార్టీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శనివారం విలేకర్లతో సుధారాణి మాట్లాడుతూ మహాసభలో పదిమంది మండల కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. స్థానిక సమస్యలు రోడ్లు, మంచినీరు వంటి సమస్యలు పరిష్కారం వంటి పలు తీర్మానాలను మహాసభ ఆమోదించిందని తెలిపారు. ఎ.మురళీ, జి.వెంకట్రావు, ఎం.కుమారి, బి.కుమారి, ఎం.శిరీష, బి.రామలక్ష్మి, పి.చిన్న సూర్యారావు, ఎస్.దుర్గమ్మ, బి.గంగాభవానిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆమె తెలిపారు.

స్వేచ్ఛా జీవనం బాలల హక్కు



చిన్నారులతో డాక్టర్ రాజేంద్రప్రసాద్

పెదవేగి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : స్వేచ్ఛా జీవనం బాలల ప్రాథమిక హక్కని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. బాలల హక్కుల వారోత్సవాలను పురస్కరించుకుని వేగివాడలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని రాజేంద్రప్రసాద్ సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో సరుకుల నాణ్యత, సరుకు నిల్వ, రికార్డుల నిర్వహణను పరిశీలించిన ఆయన చిన్నారులకు అందుతున్న సౌకర్యాలను అంగన్‌వాడీ కార్యకర్తను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో బాలలకు నిర్దిష్టంగా కొన్ని హక్కులు ఉన్నాయన్నారు. సమాజంలో స్వేచ్ఛగా జీవించే హక్కు ప్రధానమైనదన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పెదపాడు అదనపు సీడీపీవో ఎంఎస్.రాజశేఖర్, అంగన్‌వాడీ కార్యకర్త వి.సుజాత పాల్గొన్నారు.

ఆలయాల పరిరక్షణే ధ్యేయం

పెదవేగి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వీహెచ్‌పీ ఆధ్వర్యంలో జనవరి 5న విజయవాడలో హైందవ శంఖారావం భారీ సభ నిర్వహిం చనున్నామని హైందవ శంఖారావం జిల్లా కో కన్వీనర్ మేడిశెట్టి పాములు తెలిపారు. ఈ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో వంగూరు శివాలయం దగ్గర శనివారం ఏర్పాటు చేసిన దెందులూరు ఖండ సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పాములు హాజరయ్యారు. వీహెచ్‌పీ జిల్లా ధర్మ ప్రచార ప్రముఖ్ కె.ఆంజనేయులు, హైందవ శంఖారావం జిల్లా ప్రముఖ్ వంశీ, ఏలూరు గ్రామీణ ఖండ కార్యవాహ్ ఎం.కృష్ణ, విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి జి.నాగరాజు, బీజేపీ నాయకులు కె.కృష్ణప్రసాద్, జి.చైతన్య, యు.వెంకటరావు, ఎం.బుజ్జి గోపాల్, జీవీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

ద్వారకాతిరుమల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురం, దొరసానిపాడు, రామన్నగూడెం గ్రామాలకు చెందిన వివిధ అనారోగ్య బాధితులకు ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కులను శనివారం టీడీపీ నాయకులు అందజేశారు. ఆయా గ్రామాలకు చెందిన ఐదుగురు బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.4.25 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. పోలిన శ్రీనివాసరావు, లంకాసత్తిపండు, ఘంటా శ్రీనివాసరావు, నాదెళ్ల వెంకటేశ్వరరావు, పాకలపాటి మాణిక్యాలరావు, ఏపూరి కిషోర్ పాల్గొన్నారు.

నవరత్నాలు మరవని అధికారులు!

ముసునూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ఎమ్మెల్యేగా బాధ్యతలు నిర్వహించిన టీడీపీకి చెందిన కోటగిరి హనుమంతురావు గోపవరం పంచాయతీ కార్యాలయ నిర్మాణానికి వితరణగా ఇచ్చిన స్థలంలో వైసీపీ హయాంలో సచివాలయాన్ని నిర్మించారు. అయితే ప్రభుత్వం మారి 4 నెలలు పూర్తయినా నేటికీ సచివాలయంపై గత ప్రభుత్వ నవరత్నాల లోగో యథావిధిగా కొనసాగుతోంది. వైసీపీ పాలన ముగిసినా లోగో మారకపోవడంతో



సచివాలయ అధికారుల తీరుపట్ల గ్రామ టీడీపీ నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రోగం లేని ఇల్లేది!



- గుప్పిళ్ల కొద్దీ మాత్రలు మింగాల్సిందే
- దవాఖానాలకు వెళ్లాల్సిందే
- ఇంటి వైద్యానికి ముసుగు
- ఎక్కడికక్కడ కిక్కిరిసిన ఆస్పత్రులే
- కాలుష్యం.. ఆహార లోపం
- ఒత్తిడి.. అవిశ్రాంతి మరో కారణం

సండే స్పెషల్

ఒకప్పుడు ఇంటిల్లిపాదికి నిండైన ఆరోగ్యం.. కడుపునిండా తిండి, కంటి నిండా నిద్ర, ఎలాంటి ఒత్తిడులు లేవు. రోజువారీ పరుగు అంతకంటే లేదు. అంతా కూడబలుక్కుని వ్యవహారం చక్కబెట్టేవారు. ఒకవేళ ఎవరైనా అనారోగ్యం బారినపడితే అమ్మో అనుకునేవారు. అందుబాటులో వున్న ప్రకృతి వైద్యమే అప్పుడు అందరికీ వరం. అతిపెద్ద నలతతో మంచాన పడి రోజుల తరబడి గడిస్తే గాని పెద్దాసుపత్రికి తీసుకెళ్లేవారు కాదు. చిన్నా చితకా రోగాలకు అసలు మందే వేసుకునేవారుకాదు. కషాయం.. కాపడం వంటి పద్ధతులనే ఎంచుకునేవారు. కానీ రోజులు మారుతున్నాయి. రోజువారీ వ్యవహారిక శైలిలో మార్పు కొట్టొచ్చినట్లుగా కన్పిస్తోంది. రోజువారీ పని ఒత్తిడులు, వెంటాడుతున్న అసంతృప్తులు, కుటుంబ బాధ్యతలు, చదువులు, మంచి మార్కుల కోసం చిన్నారులు గంటల తరబడి పుస్తకాల్లో కూరుకుపోవడం ఇలా ఒకటేమిటి.. మారిన జీవనశైలికి తగ్గట్టుగానే ఇప్పుడు ఇంటింటికీ ఓ రోగం. మందులు వేసుకోనివారు ఉన్నారంటే నమ్మశక్యమే కాదు. అంతలా విచ్చలవిడిగా రోగాలు చెలరేగుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు నిత్యం కిక్కిరిసి కన్పిస్తున్నాయి.

ఏలూరు (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

రోజువారీ జీవన ప్రమాణాలకు అనుగుణంగానే ఎక్కువమంది అనారోగ్యాల బారినపాలవుతున్నారు. చిన్నపిల్లల దగ్గర నుంచి వయస్సు పైబడిన వారి వరకు ఆసుపత్రుల్లో వాలాల్సిందే. అంతలా అనారోగ్యం దిగజారుతోంది. ఇంతకుముందు నడివయస్కులు ఎవరైనా ఆసుపత్రికి వెళ్తే వింతగా చూసేవారు. చెడు అలవాట్లు అంటూ దీదరి ంచుకునేవారు. చిన్నారులకు జ్వరం, దగ్గు వంటి చిన్న చిన్న వ్యాధులు సంక్రమించినప్పుడు ఇంటి పట్టునే వైద్యం చేసేవారు. ఎట్టిపరిస్థితుల్లోనూ చిన్నారులకు ఇంగ్లీషు మందులు వాడేవారు కాదు. కేవలం దేశీయ వైద్యంతోనే సరిపెట్టేవారు. కాస్తంత నడివయస్కులకు ఏమాత్రం నలత చేసినా దానికి తగ్గట్టుగానే కొన్నాళ్లపాటు పత్యం చేయించేవారు. ఇలాంటి పరిస్థితుల్లో చక్కగా కొంచెం నయమైన తరువాత ఎవరి పని వారు చేసుకునేవారు. ఇప్పుడేమో ఆనాటి పరిస్థితులకు అంతా విరుద్ధమే. సరాసరిన ఒక్క కుటుంబంలోనే ఇద్దరికి మించి మందులు వాడాల్సిన పరిస్థితి తలెత్తింది. రానురానూ మారుతున్న వాతావరణ పరిస్థితులు, రోజువారీ ఒత్తిడులు వీటికి ప్రేరణగా నిలుస్తున్నాయి. వ్యవసాయదారులెవరు ఇంతకు ముందు ఒక్క రోజైనా నోట్లో మాత్ర వేసుకోవడం ఎరుగనే ఎరుగరు. అలాంటిది ఇప్పుడు పరిస్థితి మారింది. పంటపొలాల్లో వేసే పురుగుమందులు, ఎరువులు, ఇతర వాటితో రైతులు కూడా రోగాల బారినపడుతున్నారు. శ్వాసకోశ వ్యాధులు, జీర్ణకోశ వ్యాధు లతో సహా క్యాన్సర్‌లకు గురవుతున్నారు కేవలం వ్యవసాయం చేసే కుటుంబాల్లో అత్యధికులు ఏదో ఒక రోగం బారినపడుతూనే వున్నారు. ప్రత్యేకించి వ్యవసాయ కూలీలది ఇలాంటి పరిస్థితే. పురుగు సంహారిక మందులు వెదజల్లడం, ఆ రేణువులు ఊపిరితిత్తుల్లో నిక్షిప్తం కావడంతో త్వరత్వరగా మంచమెక్కుతున్నారు. గ్రామాల్లో తెలిసీ తెలియని వైద్యంతో అధిక మందులు వాడటం పెనువిపత్తులకు దారి తీస్తోంది. ఈ తరహా పరిస్థితులన్నింటిని పల్లెల్లో ప్రతి కుటుంబంలో ఎవరో ఒకరు రోజూవారీ చవిచూస్తునే వున్నారు. ఇకపోతే పట్టణాలు దీనికి అతీతమేమీ కాదు. రోజువారీ పని ఒత్తిడులు ఒక వైపు, పెరుగుతున్న కాలుష్యం, వెంటాడుతున్న మానసిక ఒత్తిడుల ముందు వీరంతా పరాజితులు.. రోగగ్రస్తులు. ఒక లెక్క ప్రకారం పల్లెల్లో కంటే పట్టణాల్లో నివసిస్తున్న వారిలోనే అత్యధికులు రోగాల బారినపడుతున్నారు. పల్లె, పట్టణం తేడా లేకుండా చిన్నా రులు అక్కడా ఇక్కడా కూడా పదుల సంఖ్యలో ఆసుపత్రుల్లో చేరుతున్నారు. ప్రత్యేకించి చలికాలంలో వీరి సంఖ్య అలవి కానంతగా పెరుగుతోంది. జలుబు, వళ్లు నొప్పులు వంటి సీజనల్ వ్యాధులకు సంబం ధించి కూడా తేలికగా తీసు కోవడం లేదు. ఇంతకు ము ందైతే జండుబామ్, అమృ తాంజన్ వాడటం, ఆవిరి పట్టడం ద్వారా సరిపెట్టు కునేవారు. ఇప్పుడు ఆ పాత పద్ధతులకు స్వస్తి పలికారు. మధ్యవయస్కుల్లో తరచూ వచ్చే వ్యాధులకు తోడు ఈ మధ్యకాలంలో న్యూమో నియా, కిడ్నీ, మధు మేహం, గుండె సంబంధిత వ్యాధులెన్నో వస్తున్నా యి. ఇప్పుడు ప్రతి కుటుం బాన్ని పట్టిపీడిస్తున్న వ్యాధుల్లో మధుమేహం ఒకటి. ఈ వ్యాధి బారినపడి వారందరూ జీవితాతం ఇన్సులిన్ మందులు రోజువారీ విధిగా వాడాల్సిందే. వీటి కోసం ఒక్కొక్కరూ రూ.600 నుంచి రూ.1100 నెలవారీ ఖర్చులు తడిసిమోడవుతున్నాయి. ఇలా ప్రతి ఇంటిలోనూ మధుమేహ వ్యాధిగ్రస్తులే. దీనికి తోడు ఈ మధ్యకాలంలో చికెన్‌గున్యా, మలేరియా, టైఫాయిడ్‌తో పాటు అంతుపట్టని వ్యాధులకు గురవున్నారు. ఒక చిన్న పట్టణంలో వైద్యం కోసం వచ్చే రోగుల సంఖ్య 300 నుంచి 650, ఇన్‌పేషెంట్స్ సంఖ్య పెద్ద పట్టణాల్లో అయితే 600 నుంచి 1000 మంది. వీరంతా నిత్యం పెద్దసంఖ్యలో మాత్రలతో పాటు ఇతరత్రా వాడాల్సిందే. అంతలా రోగాలు వెంటా డుతూ వస్తున్నాయి. కేవలం మందుల కోసం సగటు కుటుంబం రూ.1500 నుంచి రూ. 5 వేల వరకు మెడికల్ షాపులకు నెలకు సమర్పించు కోవాల్సిందే. రోజువారీ సగటు కుటుంబాల్లో ఈ బడ్జెట్ శాశ్వతంగా మారబోతోంది.

కాలుష్యం.. చెదిరిన ఆహార నియమాలు

ఇంతకు ముందు ఇంట్లో వంటకం అందరికి అనువుగా వుండేది. ఇప్పుడా పద్ధతి పూర్తిగా మారిపోయింది. అంతకంటే మించి రెస్టారెంట్లకు, కర్రీపాయింట్లకు కుటుంబాలకు కుటుంబాలే అలవాటు పడ్డాయి. ఇంట్లో వంటడం ఒకప్పుడు అందరికీ ఇష్టం. ఇప్పుడదే అందరికీ కష్టం. ఈ పరిస్థితి నుంచి దాదాపు సామాన్య కుటుంబాల నుంచి ఉన్నతవర్గాల వరకు బయట ఆహారానికే అలవాటు పడటం ఇప్పుడు అందరి ప్రాణాలను తీస్తోంది. రెస్టారెంట్లకు వెళ్లి కడుపు నిండా తినడం వీలైతే రోడ్ల పక్క కాలుష్య భరిత వాతావరణంలో వున్న ఆహారపదార్థాలను కూడా ఇట్టే తినేయడం రోగాలకు కారణమవుతోంది. ఈ మధ్యనే హోటళ్లలో నిల్వ ఉంచిన ఆహారపదార్థాలను ఎలా నిల్వ చేస్తున్నారో బహిర్గతమవుతుంది. దీనికి తోడు వీటిలో వాడే వంట నూనెలు, మసాలాలు ప్రజల ఆరోగ్యాలను పూర్తిగా దెబ్బ తీస్తున్నాయి. కాగిన నూనె అనారోగ్యానికి కారణమని, క్యాన్సర్ కారకమని పదేపదే హెచ్చరిస్తున్నా వేడి వేడి పకోడి, మిర్చి బజ్జి, పునుగుల కోసం అందరు పరుగులు తీస్తూనే ఉంటున్నారు. ఇంకోవైపు వెంటాడుతున్న కాలుష్య భూతం. నీరు గాలి, తినే ఆహారం అంతా కలుషితమే. ఒకప్పుడు క్యాన్సర్ బారిన ఒకరో ఇద్దరో ఉండేవారు. ఇప్పుడా సంఖ్య పదులు దాటి వందల్లోకి చేరుతున్నారు.

● ఆరోగ్యం మన చేతుల్లోనే..



ఎవరో వచ్చి ఏదో చేయరు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది. శ్రద్ధ తీసుకోవాల్సింది మనమే. ఆరోగ్య సంరక్షణలో కీలకం మన జీవనశైలే. ప్రస్తుత పరిస్థితుల్లో డబ్బు ఒక్కటే ప్రధానం కాదు. డబ్బు ఉండి అనారోగ్యం పాలైతే ఏమీ చేయలేం. మంచి జీవనశైలితో సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చు.

- శేషగిరిరావు, దుగ్గిరాల.

● ఆహారమే ఆరోగ్యానికి పునాది



ఆరోగ్యానికి ఆహారమే పునాదిగా భావించాలి. అనేక జబ్బులకు గతి తప్పిన ఆహార అలవాట్లే కారణం. ఈ రోజుల్లో ఇతర దేశాల సంస్కృతికి ఎక్కువగా అలవాటు పడ్డాం. సంపాదనలో పడి ఆరోగ్యాన్ని చేజేతులా పాడు చేసుకుంటున్నాం. ఆరోగ్యంగా లేనప్పుడు ఎంత సంపాదించినా ఫలితం లేదు. మనసు ప్రశాంతంగా శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండాలి.

- సరోజని, ఏలూరు

పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం

మండవల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండవల్లి పీహెచ్‌సీలో అభివృద్ధి కమిటీ సమావేశం శనివారం ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగింది. సిబ్బంది పనితీరుపై, కంటివెలుగు కార్యక్రమంపై చర్చించారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ ఎల్. కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పీహెచ్‌సీలో పాము, కుక్క కాటుకు ప్రథమ చికిత్సకు సంబంధించిన మందులు అందుబాటులో ఉన్నాయని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సర్పంచ్ మెండా ఝాన్సీ, అయ్యవారిరుద్రవరం సర్పంచ్ బి. శేషగిరిరావు, గుడివాడ చిట్టిబాబు, సీహెచ్‌వో శ్రీనివాసరావు, ఆరోగ్య కేంద్రంసిబ్బంది పాల్గొన్నారు.

అమ్మకు వేదన

నెలలు నిండకుండానే ప్రసవం ▸▸ శిశువుకూ ప్రమాదమే..

నేడు ప్రపంచ ప్రిమెచ్యూరిటీ డే

తల్లి తన గర్భంలో పెరుగుతున్న బిడ్డ ముందస్తుగా (ప్రీమెచ్యూర్డ్) పుడితే అది కూడా అనారోగ్యంతో పూర్తికాని శరీర నిర్మాణంతో పుడితే ఆ తల్లి పడే మానసిక క్షోభ, వేదన వర్ణనాతీతం. నేడు ప్రపంచ (ప్రీమెచ్యూరిటీ డే) సందర్భంగా ప్రత్యేక కథనం

- పోలవరం



ప్రిమెచ్యూరిటీ అంటే ముందస్తు పుట్టుక .. నెలలు నిండకుండా పుట్టడం.. నవజాత శిశువుల మరణాలకు, అనారోగ్యంతోఆసుపత్రిలో చేరడానికి ప్రబలమైన కారణం ముందస్తు ప్రసవం. వెయ్యి గ్రాములు అంటే కిలో కంటే తక్కువ బరువుతో పుట్టిన శిశువుల మరణాలకు శ్వాసకోశ వైఫల్యం, జన్మతః సంక్రమిత ఇన్ఫెక్షన్లు, పుట్టుకతో వచ్చే వైకల్యాలు ప్రధాన కారణాలుగా నిలు స్తాయి. గర్భం దాల్చిన 37 వారాలలోపు జన్మించిన శిశువులు ఆ దశలో లోపల అవయవాలు పూర్తిగా అభివృద్ధి చెందవు. ఎదుగు దలలో లోపం, అనారోగ్య సమస్యలు, వైకాల్యాల సమస్యలు తలెత్తుతాయి. ప్రపంచ వ్యాప్తంగా 10 మంది శిశువుల్లో ఒకరు నెలలు నిండకుండా పుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. ఐక్యరాజ్య సమితి ఇతర ఏజన్సీలు ఇచ్చిన నివేదికల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 1.34 కోట్ల మంది నెలలు నిండ కుండానే పుటుతున్నారని వారిలో దాదాపు పదిలక్షల మంది ముందస్తు సమస్యల కారణం గానే చనిపోతున్నారని తేలింది. తల్లిలో అనారోగ్య సమస్యలు ఎక్కువశాతం కారణాలుగా నిలుస్తున్నాయి. మధుమేహం, అధిక రక్తపోటు, లేదా థైరాయిడ్ లాంటి సమస్యలు , గర్భధారణ సమయంలో గర్భాశయం, మూత్రాశయం లేదా మూత్రపిండాలు (కిడ్నీలు)లో ఇన్ఫెక్షన్లు, లేదా గర్భాశయ సమస్యలు, గర్భాశయ నిర్మాణంలో లోపాలు వల్ల కూడా ముందస్తు జననాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కవలలు లేదా ముగ్గురు కంటే ఎక్కువ శిశువులు గర్భంలో ఉండడం వలన గర్భాశయంలో తగినంత స్థలం లేకపోవడం తల్లి శరీరంపై ఒత్తిడి పెరగడం వల్ల కూడా ముందస్తు ప్రసవాలు జరిగే అవకాశాలు న్నాయి. పోషకాహార లోపం లేదా గర్భధారణ సమయంలో తగినంత బరువు పెరగకపోవడం కూడా ముందస్తు ప్రసవానికి కారణమవుతుంది. అధిక మానసిక శారీరక ఒత్తిడులు కూడా ఈ సమస్యలకు కారణంగా నిలుస్తున్నాయి. మూత్ర సంబంధ ఇన్ఫెక్షన్లు లేదా లైంగిక సంక్రమిత వ్యాధులు , అంటు వ్యాధులకు చికిత్స లేకుండా వదలి వేయడం వంటివి కారణాలుగా ఉన్నాయి.

నివారణకు ఏం చెయ్యాలి ?

ముందస్తు జననం నివారణ కోసం తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలి. గైనకాలజిస్టుల సూచనలు పాటించాలి. ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవరుచుకోవడం, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలను అధిగమించడం మానసిక శారీరక వత్తిడిని నివారించడం, గర్భస్థ శిశువు నుంచి వచ్చే హెచ్చరిక సంకేతాలను గ్రహించడం వంటివి ప్రధానంగా పాటించాలి. పుష్కలంగా పండ్లు, తృణ ధాన్యాలు, కూరగాయలు, ఆకు కూరలు పోషక విలువలు కలిగిన సమతుల ఆహారం తీసుకోవాలి. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్య లకు డాక్టర్ల సలహాల మేరకు మందులు క్రమం తప్పకుండా వాడాలి. వ్యక్తిగత శుభ్రత పాటించడం, ధ్యానం, లోతైన శ్వాస వ్యాయా మాలు అవలంభించాలి. బిడ్డకు బిడ్డకు మధ్య దూరం కనీసం 18 నుంచి 24 నెలలు ఉండేలా చూసుకోవాలి. అధిక బరువులు ఎత్తడం ఎక్కువసేపు నిలబడడం , అతిగా శరీరానికి శ్రమ కలిగించడం చేయకుండా విశ్రాంతి తీసుకోవాలి. ముందస్తు ప్రసవాల నివారణకు నియోనాటాలజిస్టని ముందస్తుగా సంప్రదించాలి. ప్రసవ సమయంలో శిశువుకి శ్వాస సమస్యలు అల్పోష్ణస్థితికి గుర వకుండా ఇంక్యుబేటర్లు, రేడియంట్ వార్మర్‌లు, ఆక్సిజన్ సౌకర్యాలు కలిగిన ఆస్పత్రులను ఎంచుకోవాలి.

నీటి సంఘాల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

కైకలూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం త్వరలోనే నీటి సంఘాల ఎన్నికల తేదీలను ప్రకటిస్తున్న నేపథ్యంలో అధికారులంతా సిద్ధంగా ఉండాలని ఇన్‌చార్జి తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించే అధికారులకు శిక్షణ తరగతులను నిర్వహించారు.

ముసునూరు: సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నిర్వహణపై శనివారం మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు మాస్టర్ ట్రైనర్‌లు బి.వెంకటేశ్వరరావు, టి.యువ రాజు శిక్షణ ఇచ్చారు. ఇరిగేషన్ అధికారి విజయకుమార్ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే గ్రామాల అభివృద్ధి

ముసునూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అక్కిరెడ్డిగూడెంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను టీడీపీ గ్రామ అధ్యక్షుడు బర్మా శ్రీనివాసరావు, రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మానురాజు సురేష్‌లతో కలిసి సర్పంచ్ పులిబళ్ళ లక్ష్మీ సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందని, సీఎం చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. పంచాయతీలో రూ. 15.50 లక్షలతో 310 మీటర్ల సీసీ రోడ్లు నిర్మాణానికి పనులు ప్రారంభించామన్నారు.

బాల్య వివాహాలు నిషేధం

ముదినేపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అల్లూరులో హైస్కూలు విద్యార్థులకు కిశోర బాలికలకు బాల్య వివాహాలు నిషేధం, పోషకాహార పథకాలపై శనివారం ఐసీడీఎస్ సిబ్బంది అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్.ప్రసూన మాట్లాడుతూ బాల్య వివాహాలు అరికట్టడంపై బాలబాలికలు అవగాహన పెంచుకోవాలన్నారు. బాలికలు రక్తహీనత నివారణకు పోషకాహారం తీసుకోవాలన్నారు. హెచ్‌ఎం రామోజీ, అంగన్‌వాడీ టీచర్ భాగ్యలక్ష్మి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ముదినేపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురంలో రూ.2 లక్షల పంచాయతీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు ప్రారంభించారు. పంచాయతీ సభ్యులు నీలం సుమతి, చీదెళ్ల సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కీర్తి రామ్‌ప్రసాద్

బీజేపీ బలోపేతానికి సైనికుల్లా పని చేయాలి

కలిదిండి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి నుంచి బీజేపీని బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కీర్తి రామ్ ప్రసాద్ అన్నారు. శనివారం కలిదిండిలో పార్టీ మండల అధ్యక్షుడు నంబూరి బాండు రాజు అధ్యక్షతన జరిగిన మండల కార్యవర్గ సమా వేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ సభ్యత్వాల నమోదులో కైకలూరు ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు తలారి శేషగిరిరావు, నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమమే టీడీపీ లక్ష్యం

▸▸ ఎంపీ పుట్టా మహేష్ కుమార్



భైరవపట్నం సభ్యత్వ నమోదులో ఎంపీ పుట్టా

మండవల్లి/ముదినేపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమానికి టీడీపీ కట్టుబడి ఉందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ తెలిపారు. మండవల్లి మండలం భైరవపట్నంలో శనివారం పార్టీ సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు డిసెంబరులో, చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు జనవరిలో ప్రారం భించడానికి తమ ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి అధికారులతో కలసి మండలాల వారీగా సమా వేశాలు నిర్వహించి అప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఇటీవల వివిధ కార్పొ రేషన్‌లకు డైరెక్టర్‌లుగా ఎంపికైన కొడాలి వినోద్, అంద్రాజు శ్రీను, లంక రత్నరాజు నాయకులు ఘనంగా సన్మానించారు. ప్రజాభిమానం వల్లే కూటమి ప్రభుత్వం వైసీపీ నిరంకుశ పాలనకు స్వస్తిపలికి రాష్ట్రంలో తిరిగి ప్రజాస్వామ్యానికి పునాది వేసిందని ఎంపీ పుట్టా అన్నారు. ముదినేపల్లి మండలం పెదపాలపర్రులో పార్టీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి అధ్యక్షతన శనివారం జరిగిన పార్టీ సభ్యత్వ నమోదు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ రావి వెంకటేశ్వర రావు టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు యనమదల విద్యార్థులు



నూజివీడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు యనమదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానో పాధ్యాయుడు ఎంఎస్ నాగరాజు తెలిపారు. ఈ నెల 13న కృష్ణాజిల్లా గూడూరులో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన జాజుల మనోజ్‌కుమార్, నక్కా అజయ్‌బాబు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారన్నారు. విద్యార్థులను సర్పంచ్ వరికూటి వెంకటేశ్వరరావు, విద్యాకమిటీ ఛైర్మన్ పలగాని శ్రీనివాసరావు, గ్రామపెద్ద పల్లెర్లమూడి రామోజీ అభినందించారు.

చిన్నారి వైద్యానికి విరాళాల అందజేత



కైకలూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థి వైద్యానికి విద్యార్థులంతా విరాళాలు సేకరించడం అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. శనివారం కైకలూరు నేషనల్ స్కూల్‌లో చదువుతున్న పేద విద్యార్థికి శ్రీ కృష్ణయాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కరేటి శ్రీహరి, ఎమ్మెల్యే చేతుల మీదుగా చెక్కును అందజేశారు. కైకలూరు నేషనల్ స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్న కైలాక్షి బ్రెయిన్ సంబంధ వ్యాధితో హైదరాబాద్ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె వైద్యానికి సుమారు రూ. 25 లక్షలు ఖర్చు వుతుందని తెలిసి పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి రూ.3,51,000 విరాళాలను సేకరించి స్కూల్ కరస్పాండెంట్ గురజాడ చంద్రమోహన్ ఆధ్వర్యంలో చెక్కును అందచేశారు. ఎంపీపీ అడవి కృష్ణ, కూటమి నేతలు పూల రామచంద్రరావు, కొల్లి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వెండి మకర తోరణం అందజేత

కైకలూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కైకలూరు-ఏలూరు రహదారిలోని అయ్యప్పస్వామి ఆలయంలో స్వామివారికి శనివారం కైకలూరు వెలమపేటకు చెందిన అయ్యప్ప మాలధారుడు కందుబోతు శ్రీను రూ.1,73,000 విలువచేసే వెండి మకరతోరణాన్ని బహూకరించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ముదునూరి రవి, ఎలకటూరి రవీంద్రబాబు, మాడపాటి శ్రీనివాస రావు, గురుస్వామి అప్పారావు, స్వాములు పాల్గొన్నారు.

సామూహిక సత్య వ్రతాలు

వరహాపట్నంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిగాయి. ఎమ్మెల్యే కామినేని పాల్గొని పూజలు చేశారు. ఐదేళ్లుగా కార్తీక మాసంలో కృత్తికా నక్షత్రాన్ని పురస్కరించు కుని వ్రతాలను ఆచరిస్తున్నారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన జరిగింది.



పడాలి హైస్కూల్ విద్యార్థులకు బహుమతు లిస్తున్న దాత ప్రదీప్ కుమార్

ఉత్తమ విద్యార్థులకు బహుమతులు

ముదినేపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం సందర్భంగా గురువారం ముదినేపల్లి మండలం వడాలి జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన పలు పోటీల్లో విజేతలైన విద్యార్థులకు శనివారం బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం వి.ప్రభుదాసు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్స్, జూనియర్స్, సబ్ జూనియర్స్ విభాగాల్లో నిర్వహించిన ఆటల పోటీలు, క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు విజయవాడ ప్రదీప్ ఆగ్రోఫామ్ సంస్థ అధినేత ప్రదీప్ కుమార్ బహుమతులు అందజేశారు. పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

▸▸ ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు ▸▸ అయ్యంకి రమణయ్యకు నివాళులు

చాట్రాయి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చనుబండ శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు 'గ్రంథాలయాల ఉపయోగాలు-స్వాతంత్ర్యోద్యమంలో గ్రంథాలయాల పాత్ర'పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం గ్రంథాలయ ఉద్యమ పితామహుడు డాక్టర్ ఎస్ఆర్ రంగరాజన్, పాతూరి నాగభూషణం, ఐఎస్‌జి వెంకట రమణయ్య సేవలను వక్తలు కొనియాడారు. స్థానిక అధికారులు ఏకాంబరాచారి, జె. శ్రీనివాసరావు, ఏసుబాబు, లైబ్రేరియన్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

ముసునూరు: ముసునూరు, గోపవరం శాఖా గ్రంథాలయాల్లో గ్రంథాలయ అధికారులు సునీల్‌కుమార్, టి.రాజేశ్వరి ఆధ్వర్యంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. జడ్పీ పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లిలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు సైబర్ నేరాలు - జాగ్రత్తలు, మాదక ద్రవ్యాలు అనర్థాలు అనే అంశాలపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో ముదినేపల్లి జడ్పీ హైస్కూల్ సోషల్ టీచర్ డి.అనిల్ కుమారి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అంతకు ముందు గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖుల జీవిత విశేషాలను రిటైర్డ్ గ్రంథాలయ అధికారి అవిర్నేని వెంకటేశ్వరరావు, వికాస్, గౌతం పాఠశాలల ప్రిన్సిపాల్స్ నక్కా కనక మోహన్, కొత్తూరు వెంకట సుబ్బారావు వివరించారు.

కలిదిండి: కలిదిండి శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలు, సోషల్ మీడియా వల్ల కలిగే నష్టాలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈ నెల 20న బహుమతులు అందిస్తామని గ్రంథాలయాధికారి రమేష్‌బాబు తెలిపారు.

మండవల్లి: గ్రంథాలయాలతో విజ్ఞానం పెరుగుతుందని ఎంపీడీవో రామలింగేశ్వరరావు తెలిపారు. మండవల్లి గ్రంథాలయంలో జరిగిన వారోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. గ్రంథాలయ ఉద్యమకారులైన అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం తదితరులను స్మరించుకున్నారు. పంచాయతీ కార్యదర్శి ఎం. కొండలు, మండవల్లి హైస్కూల్ గ్రంథాల అధికారి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



చనుబండ గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నేడు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

ముసునూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ముసునూరులో వాసన్ కంటి ఆసుపత్రి వైద్య బృందం సహకారంతో ఆదివారం ఉచిత మెగా కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకుడు గార్లపాటి నరసింహరావు తెలిపారు. ఎంపీపీ పాఠశాల ఎదురుగా ఉన్న దేవినేని ఆంజనేయులు ఖాళీ స్థలంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యశిబిరం జరుగుతుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు ఇళ్ల స్థలాల కోసం ఆందోళన

నూజివీడు టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాల కోసం సీపీఐ నేతృత్వంలో ఆందోళన చేపడుతున్నట్లు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు తెలిపారు. నూజివీడు మండలం సిద్ధార్థనగర్ గ్రామంలోని తండాల్లో ఈ నెల 18న నిర్వహించ తలపెట్టిన ఆందోళనపై ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు.

అభివృద్ధి లక్ష్యంగా ప్రణాళిక

కైకలూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో మౌలిక వసతుల అభివృద్ధి జరిగేలా అన్ని శాఖల అధికారులు కలిసి ప్రణాళిక తయారు చేయాలని ఇన్‌ఛార్జి ఎంపీడీవో ప్రకాశ రావు అన్నారు. శనివారం కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల్లో ఆర్థిక ప్రణాళిక 2025-26 సంవత్సరానికి మండల స్థాయి అధికారులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈవోపీఆర్‌డీ కొండలరావు, ఎంఈవో-2 వి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రోగాలతో జాగ్రత్త

చాట్రాయి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శీతాకాలం కారణంగా జలుబు, దగ్గు, జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున చిన్న పిల్లలు, వృద్ధుల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని చనుబండ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దుర్గాప్రసాద్ కోరారు. కృష్ణారావుపాలెంలో శనివారం 104 వైద్య శిబిరం నిర్వహించి 48 మందికి పరీక్షలు జరిపి మందులు అందజేశారు. అనంతరం స్థానిక అంగ న్వాడీ, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్ సత్యవాణి, ఏఎన్ ఎం సరోజిని వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

చాట్రాయి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంకొల్లు గ్రామానికి చెందిన కంద్రేజుల చంద్రశేఖర్ పోలవరం గ్రామంలో లారీ కాటా లీజుపై నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి ఆయన ఇంటి వద్ద ఉన్న సమయంలో ఒక వ్యక్తి ఫోన్ చేసి సరుకు తూకం వేయాలి కాటా వద్దకు రావాలని కోరగా చంద్రశేఖర్ ద్విచక్ర వాహనంపై కాటా వద్దకు వచ్చాడు. ఎవరూ లేకపోవటంతో వెనుతిరిగి వెళుతుండగా తమ్మిలేరు ప్రాజెక్టు వద్ద కొంతమంది అడ్డగించి దాడి చెయ్యటంతో చంద్రశేఖర్ తీవ్రంగా గాయపడ్డాడు. చంద్రశేఖర్ భార్య సమాచారంతో ఎస్సై రామకృష్ణ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి గాయపడిన చంద్రశేఖర్‌ను 108లో చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చంద్రశేఖర్‌కు కొంత మంది స్థానికులతో ఉన్న విభేదాలు కారణంగా దాడి జరిగినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫెన్సింగ్ ధ్వంసంపై ఫిర్యాదు

నూజివీడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఫెన్సింగ్ ధ్వంసం చేశారంటూ నూజివీడు మండలం జంగంగూడెం గ్రామానికి చెందిన కొల్లి సత్యనారాయణ నూజివీడు రూరల్ పోలీసులను ఫిర్యాదు చేశారు. జంగంగూడెంలో తన రెండెకరాల పొలానికి ఫెన్సింగ్ వేసి ఉండగా, సరిహద్దుదారులైన నాగేశ్వరరావు, వెంకట రామయ్య శుక్రవారం రాత్రి ఫెన్సింగ్‌ను ధ్వంసం చేశారని, అదేమని అడిగితే తనపై దాడికి యత్నించారని వారిపై చర్యలు తీసుకోవాలని నూజివీడు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు కొల్లి సత్యనారాయణ తెలిపారు.

ఎక్సైజ్ దాడులు.. ముగ్గురి అరెస్టు

నూజివీడు టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో మీర్జాపురంలో గొడుగు శివ ప్రసాద్‌ను అదుపులోకి తీసుకొని 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. పోలసానపల్లిలో పర్సా రమేష్, తాత కృష్ణను అదుపులోకి తీసుకున్న రూరల్ ఎస్సై లక్ష్మణ్ బాబు వారి నుంచి 25 క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు.

పేకాట శిబిరంపై దాడి

ముసునూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వెంకటాపురం గ్రామ శివారులో పేకాట శిబిరంపై ముసునూరు పోలీసులు శనివారం దాడి చేశారు. ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.3200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు.